

తుంగభద్ర డ్యామ్‌ను పరిశీలిస్తున్న కర్ణాటక, ఆంధ్ర రాష్ట్రాల ప్రజాప్రతినిధులు



క్రస్ట్‌గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు



ఆశలు ఢాం!

- 65 టీఎంసీల నీరు నదికి వదలనున్న అధికారులు
- నీటి నిల్వ 40 టీఎంసీలకు తగ్గితేనే క్రస్ట్‌గేట్ అమర్చేందుకు అవకాశం
- మూడు, నాలుగురోజుల్లో బిగించనున్నట్లు సమాచారం
- క్రస్ట్‌గేట్ తయారీ బాధ్యత ప్రముఖ కంపెనీలకు అప్పగింత

ఖాళీ అవుతున్న తుంగభద్ర డ్యామ్

బళ్లారి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల నీటి ప్రాజెక్టుగా ఉన్న తుంగభద్ర జలాశయం (టీబీ డ్యామ్) ప్రమాదంలో పడింది. డ్యామ్‌కి అమర్చిన 19వ క్రస్ట్‌గేట్ చైన్ లింక్ తెగిపోయి, శనివారం రాత్రి కొట్టుకుపోయింది. దీంతో డ్యామ్‌లోని నీటిని నదికి వదిలేస్తున్నారు. సుమారు 65 టీఎంసీల మేర నీరు నదికి విడుదల చేయనున్నట్లు టీబీ బోర్డు కార్యదర్శి ఓఆర్‌కే రెడ్డి, ఎస్‌ఈ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. డ్యామ్‌లో నీటి నిల్వ 40 టీఎంసీలకు తగ్గితేనే కొత్త క్రస్ట్‌గేట్ అమర్చడానికి అవకాశం ఉంటుందని బోర్డు ఇంజనీర్లు తెలిపారు. డ్యామ్‌కి మొత్తం 33 క్రస్ట్‌గేట్లు ఉన్నాయి. ఇందులో 19వ గేట్‌కు ఉండే చైన్‌లింక్ తెగిపోయింది. దీంతో గేట్ జారి కిందకు పడిపోయింది. గేటు డ్యామ్‌లోకి పడిపోయిందా, నదిలోకి కొట్టుకొచ్చిందా అనేది నీటిప్రవాహం తగ్గితేనే తెలుస్తుందని బోర్డు వర్గాలు పేర్కొంటున్నాయి.

క్రస్ట్ గేట్ ఎత్తే ప్రయత్నంలో..

గేట్ తెగే సమయంలో డ్యామ్‌లో 104.182 టీఎంసీల నీటి నిల్వ ఉంది. ఇన్‌ఫ్లో 36,739 క్యూసెక్కులు వస్తుండగా.. 54,960 క్యూసెక్కులు నదికి వదులుతున్నారు. డ్యామ్ 33 గేట్లను అడుగు మేర ఎత్తి నదికి నీరు వదులుతున్న సమయంలో శనివారం రాత్రి 19వ క్రస్ట్‌గేట్‌ను మరో అడుగు ఎత్తేందుకు అధికారులు ప్రయత్నించారు. ఆ సమయంలో క్రస్ట్ గేట్‌కు ఉండే ఒక చైన్ లింక్ కట్ అయింది. నీటి ఉధృతికి మరో చైన్ లింక్ కూడా తెగిపోయింది. గేట్ కనిపించకుండా నీటిలో కొట్టుకుపోయింది. వెంటనే అధికారులు అప్రమత్తమయ్యారు. అన్నిగేట్లు ఎత్తి నీరు నదికి వదిలారు. మిగిలిన 32 గేట్లు 2 నుంచి 3 అడుగుల మేర ఎత్తి నదికి 1.10 లక్షల క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. డ్యామ్‌లోని నీటిలో 65 టీఎంసీలుపోనూ నిల్వ 40 టీఎంసీలకు తగ్గితేనే క్రస్ట్‌గేట్ అమర్చేందుకు వీలవుతుందని అధికారులు పేర్కొంటున్నారు. దీంతో ఇన్‌ఫ్లోతోపాటు డ్యామ్‌లోని నీరు అంతా నదికి వదులుతున్నారు. 65 టీఎంసీల నీరు కిందకు వెళ్లడానికి కనీసం మూడు రోజులు పడుతుందని బోర్డువర్గాలు తెలిపాయి. నదీతీర గ్రామాల వారిని అప్రమత్తం చేస్తున్నారు.

ప్రజాప్రతినిధుల పరిశీలన

కర్ణాటక ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్, పలువురు ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఏపీలోని రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ఆదివారం టీబీ డ్యామ్‌ను పరిశీలించారు. నీరు వృథాకాకుండా వెంటనే చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. రైతులకు నీరు అందేలా చూడాలని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు సూచించారు.

ప్రముఖ కంపెనీలకు గేట్ తయారీ బాధ్యతలు

విజయనగరలోని తుంగభద్ర స్టీల్ తయారీ కంపెనీతోపాటు హిందుస్థాన్ స్టీల్ తయారీ కంపెనీ, నారాయణ స్టీల్ తయారీ కంపెనీకి క్రస్ట్‌గేట్ తయారీ బాధ్యతలు అప్పగించినట్లు బోర్డు కార్యదర్శి ఓఆర్‌కే రెడ్డి తెలిపారు. విజయవాడ, హైదరాబాద్‌లోని అనుభవజ్ఞుల సూచనలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కర్ణాటక, ఆంధ్ర ముఖ్యమంత్రుల ఆరాతుంగభద్ర డ్యామ్ క్రస్ట్‌గేట్ ఊడిపోవడంపై కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య, ఏపీ సీఎం నారా చంద్రబాబునాయుడు.. అధికారులతో వివరాలు ఆరాతీశారు. వెంటనే మరమ్మతులు చేసి నీరు వృథా కాకుండా చూడాలని ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు.. అధికారులకు సూచించారు.

సమగ్ర దర్యాప్తు చేపట్టాలి

ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

రాయదుర్గం, ఆగస్టు 11: తుంగభద్ర జలాశయం 19వ క్రస్ట్ గేట్ చైన్‌లింక్ తెగిపోవడంపై లోతుగా సమగ్ర దర్యాప్తు చేయాలని రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఆయన హాస్పేట్‌లోని తుంగభద్ర జలాశయాన్ని ఆదివారం సందర్శించారు. కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌తో కలిసి క్రస్ట్‌గేట్‌ను పరిశీలించారు. దీనిపై బోర్డు ఎస్‌ఈ శ్రీకాంత్‌రెడ్డితో పాటు అధికారులతో సమీక్షించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. టీబీడ్యామ్‌కు జూలై నెలలోనే పూర్తిగా నీరు చేరడంతో రైతుల్లో ఆనందం కలిగిందన్నారు. ఈ ఏడాది తాగు, సాగునీటికి సమస్య ఉండదని అనుకుంటున్న క్రమంలో శనివారం అర్ధరాత్రి తుంగభద్ర డ్యాం 19వ క్రస్ట్‌గేట్ చైన్‌లింక్ తెగి కొట్టుకుపోవడం బాధాకరమన్నారు. క్రస్ట్‌గేట్ చైన్‌లింక్ తెగిపోవడం పట్ల మానవ తప్పిదమా లేక ప్రమాదమా అనే విషయంపై సమగ్ర దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. చైన్‌లింక్ తెగిపోవడంతో 60 టీఎంసీల నీటిని నష్టపోవాల్సిన పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. దీని కారణంగా ఆయకట్టు రైతులకు భవిష్యత్‌పై తీవ్రమైన ఆందోళన కలుగుతుందన్నారు. ముఖ్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దీనిపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారని తెలిపారు. సత్వరమే గేటును బిగించడానికి అవసరమైన చర్యలను బోర్డు అధికారులు చర్యలు తీసుకుంటున్నారన్నారు. యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేసేందుకు ఇప్పటికే నిపుణులను రంగంలోకి దించినట్లు స్పష్టం చేశారు.

జలాశయం భద్రతపై పటిష్ట చర్యలు చేపట్టాలి: సీపీఎం

అనంతపురం కల్చరల్, ఆగస్టు 11: తుంగభద్ర డ్యామ్ భద్రతపై పటిష్ట చర్యలు చేపట్టాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు ఆదివారం సంయుక్త ప్రకటనలో డిమాండ్ చేశారు. తుంగభద్ర డ్యామ్ 19వ గేటు కొట్టుకుపోవడంపై వారు ఆందోళన వ్యక్తం చేశారు. 96 ఏళ్ల డ్యామ్ చరిత్రలో మొట్టమొదటిసారి గేట్ కొట్టుకుపోయిందని పేర్కొన్నారు. డ్యామ్ భద్రతపై కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు తక్షణమే స్పందించి, అవసరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లాలో వర్షాల్లేక అత్యధిక సాగుభూములు బీడుగా మారుతుంటే డ్యామ్‌లో ఉన్న నీటిని సక్రమంగా ఉపయోగించుకునే పరిస్థితి లేకపోవడానికి ప్రభుత్వాలే బాధ్యత వహించాలన్నారు. వరద కాలువను నిర్మించి డ్యామ్ నుంచి వచ్చే అదనపు నీటిని కిందిభాగంలో ఉన్న అనంతపురం జిల్లా అభివృద్ధికి ఉపయోగించాలని కోరారు.

నిర్వహణలోపంతోనే..

సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున



అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 11: టీబీ డ్యాం బోర్డు అధికారుల నిర్లక్ష్యం, నిర్వహణలోపంతోనే గేటు ఊడిపోయిందని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి చిరుతల మల్లికార్జున ఓ ప్రకటనలో తెలిపారు. గేటు ఊడిపోవడానికి డ్యాం అధికారులే బాధ్యత వహించాలన్నారు. ఏపీ జలవనరుల శాఖ మంత్రి, ఉన్నతాధికారులు తుంగభద్ర డ్యాంను సందర్శించి, మిగిలిన గేట్ల పటిష్టత, సామర్థ్యాన్ని పరిశీలించాలన్నారు. ఇటీవలి వరదలతో టీబీ డ్యాం పూర్తిస్థాయిలో నీటితో నిండిపోయిందని, 33గేట్లు ఎత్తివేసి నీటిని కిందికి వదిలారన్నారు. 19వ గేటు ఊడిపోవడం దురదృష్టకరమన్నారు. యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేసి కరవు జిల్లాకు నీటిని అధికంగా తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

టీబీ డ్యామ్ గేట్ పునరుద్ధరిస్తాం

■ మంత్రి పయ్యావుల కేశవ్



అనంతపురం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): సాధ్యమైనంత త్వరలోనే తుంగభద్ర డ్యామ్ గేట్‌ను పునరుద్ధరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. టీబీ డ్యామ్ గేట్ కొట్టుకుపోయిందన్న సమాచారం నేపథ్యంలో మంత్రి పయ్యావుల కేశవ్ ఆదివారం ఉదయం ఢిల్లీ నుంచి స్పందించారు. తుంగభద్ర డ్యామ్ గేట్ కొట్టుకుపోయిన విషయం, ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై మంత్రి ఓ వీడియో ద్వారా వివరించారు. కర్ణాటకలోని హోస్పేట్ వద్ద ఉన్న తుంగభద్ర డ్యామ్ గేట్ నీటి ప్రవాహానికి కొట్టుకుపోయిన విషయం ఆదివారం తెల్లవారుజామున తెలిసిందన్నారు. వెంటనే రాష్ట్ర ఉన్నతాధికారులను అప్రమత్తం చేశామన్నారు. ఆ తర్వాత తుంగభద్ర డ్యామ్ అధికారులతో చర్చించామన్నారు. డ్యామ్ గేట్ కొట్టుకుపోవడానికి కారణాలపై ఆరా తీశామన్నారు. డ్యామ్ గేట్ కొట్టుకుపోవడం ద్వారా పెద్ద ఎత్తున నీరు వృథాగా నదిలోకి పోతోందన్నారు. ఉమ్మడి అనంతపురం, కర్నూలు జిల్లాలకు తుంగభద్ర డ్యామ్ గుండెకాయ లాంటిదన్నారు. ఈ డ్యామ్‌ను నమ్ముకొని రెండు ఉమ్మడి జిల్లాల్లో లక్షలాది మంది రైతులు వివిధ పంటలను సాగు చేస్తున్నారని వెల్లడించారు. వీటిని దృష్టిలో ఉంచుకొని సాధ్యమైనంత త్వరలోనే డ్యామ్ గేట్‌ను పునరుద్ధరించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశించారన్నారు.

కొత్త డ్యామ్‌లలో ప్రత్యేక డిజైన్

తుంగభద్ర డ్యామ్ పురాతన డ్యామ్ కావడంతో అక్కడ స్టాప్ లాగ్ గేట్ అలైన్‌మెంట్ డిజైన్ లేకపోవడం మనకు నష్టం కలిగించే అంశమన్నారు. గేట్లు కొట్టుకుపోయినప్పుడు ప్రత్యామ్నాయంగా ఇంకో గేట్‌ను దించుకొనే అవకాశం కొత్తగా చేపట్టే డ్యామ్‌ల్లో డిజైన్ చేస్తున్నారని తెలిపారు. అలాంటి అవకాశం తుంగభద్ర డ్యామ్‌లో లేకపోవడంతో నీరు వృథాగా పోతోందన్నారు. టీబీ డ్యామ్ గేట్ పునరుద్ధరణపై ఇరిగేషన్ ప్రాజెక్టుల్లో పరిపూర్ణమైన అవగాహన కలిగిన వ్యక్తులు, సుదీర్ఘమైన అనుభవం ఉన్న విశ్రాంత అధికారులు గన్నయ్యానాయుడు తదితరులను సంప్రదించామన్నారు. టీబీ డ్యామ్ వద్ద ప్రత్యామ్నాయంగా అత్యవసర గేట్‌ను తయారు చేసుకొని తాత్కాలికంగా నీటిని నిలిపేందుకు అవసరమైన చర్యలు తీసుకునేందుకు అన్ని ప్రణాళికలను సిద్ధం చేస్తున్నామన్నారు. రబ్బర్ గేట్‌ను తీసుకువచ్చి వెంటనే అడ్డం పెట్టడం మూలంగా నీటిని నిలువరించే ప్రయత్నాలపైనా దృష్టి సారించామన్నారు. రాయలసీమ వాసిగా డ్యామ్ గేట్ కొట్టుకుపోయిందనే సమాచారం తనను ఆందోళనకు గురిచేసిందన్నారు. ఎవరూ ఆందోళన చెందవద్దని డ్యామ్ గేట్‌ను ప్రభుత్వం పునరుద్ధరించే పనిలో ఉందని మంత్రి పయ్యావుల కేశవ్ స్పష్టం చేశారు.

కొట్టుకుపోయిన సంతోషం

బొమ్మనహాళ్, ఆగస్టు 11: తుంగభద్ర డ్యాం గేట్ కొట్టుకుపోవడంతో నీరంతా వృథా అవుతోంది. దీంతో ఎన్నో ఆశలతో సేద్యపు పనులు ప్రారంభించిన హెచ్చెల్సీ ఆయకట్టు రైతులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. ఈఏడాది త్వరగా డ్యాం నిండింది. సాగుకు ఇబ్బందులు ఉండవని భావిస్తున్న తమకు గేటు కొట్టుకుపోయి నీరంతా పోతుండటం ఆశనిపాతమైందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డ్యాంలో ఉన్న నీరంతా బయటకు వెళితే గాని మరమ్మతులు సాధ్యం కాదని ఇంజనీర్లు చెబుతున్న నేపథ్యంలో మరమ్మతులు పూర్తై మళ్లీ డ్యాం నిండేది ఎప్పుడు? తమ బతుకులు బాగుపడేదెప్పుడని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

త్వరగా మరమ్మతులు చేయాలి



తుంగభద్ర డ్యాం గేట్ కొట్టుకుపోవడంతో ఆందోళన కలుగుతోంది. గత ఏడాది వరిపంట నష్టం కలిగింది. అంతే కాకుండా రబీసీజన్‌లో పెట్టిన పత్తి పంట దెబ్బ కొట్టింది. ఈ సారి తుంగభద్ర జలాశయం నుంచి కాలువలకు సాగునీరు ముందుగా రావడంతో వ్యవసాయ పనులు ప్రారంభించా. ఇంతలోనే డ్యాం గేటు కొట్టుకుపోయి నీరు వృథాగా బయటకు పోతుండటం ఆందోళన కలిగిస్తోంది. అధికారులు త్వరగా మరమ్మతులు చేయించి రైతులను ఆదుకోవాలి.

\- ఆంజనేయులు, రైతు, గౌనూరు


దేవుడే కరుణించాలి



తుంగభద్ర జలాశయం నుంచి వచ్చే నీటిపై ఆధారపడి 35 ఎకరాలు వరి పంట సాగు చేస్తున్నా. తుంగభద్ర డ్యాం గేట్ కొట్టుకుపోయింది. ఈ విషయం ఆందోళన కలిగిస్తోంది. డ్యాంలో ఉన్న నీరు బయటకు పోతే గాని పనులు చేయలేమని అధికారులు చెప్పడంతో ఇక దేవుడే మమ్మల్ని రక్షించాలి. నా సొంత భూమి 13 ఎకరాల భూమితో పాటు 22 ఎకరాలు కౌలుకు చేసుకుంటున్నా.

\- ఈశ్వర, శ్రీధరఘట్ట

కల్యాణోత్సవం నిర్వహిస్తున్న వేదపండితులు



ఇలలో ఇలవేల్పు పెళ్లి

కన్నుల పండువగా శ్రీనివాసుడి కల్యాణం



కల్యాణోత్సవాన్ని వీక్షిస్తున్న భక్తులు

అనంతపురం కల్చరల్, ఆగస్టు 11: లోక కల్యాణార్థం ఆదివారం పాతూరు దత్తాత్రేయ మందిరంలో శ్రీనివాసుడి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ ఆవరణలో శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి కొలువు దీర్చారు. వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ శ్రీవారి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి అప్పా సుధీర్, కార్యవర్గ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

మూడు రోజుల్లో ఫ్రీజర్ల రిపేరీ

'శవాల నరకం'పై వైద్యాధికారుల్లో కదలిక.. సూపరింటెండెంట్, ప్రిన్సిపాల్‌కు తలంటిన కలెక్టర్

ఆంధ్రజ్యోతి స్పందన

అనంతపురం టౌన్, ఆగస్టు 11: 'శవాల నరకం' శీర్షికన ఆంధ్రజ్యోతి దినపత్రికలో ఆదివారం ప్రచురితమైన కథనంతో సర్వజన ఆస్పత్రి వైద్యాధికారులలో కదలిక వచ్చింది. జిల్లా కలెక్టరు వినోద్ కుమార్ సైతం స్పందించి ఈవ్యవహారాలపై ఆస్పత్రి సూపరింటెండెంట్, వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌లతో ఫోన్‌లో మాట్లాడి సీరియస్‌గా హెచ్చరికలు జారీ చేసినట్లు సమాచారం. దీంతో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు ఈ ఆరోపణలను చక్కదిద్దేందుకు రంగంలోకి దిగారు. ఆర్‌ఎంఓలు, సంబంధిత హెచ్‌ఓడీలతో ఆయన మాట్లాడారు. మార్చురీలో శవాలను భద్రపరిచేందుకు ఏర్పాటుచేసిన ఫ్రీజర్లను మూడురోజులలో పనిచేసేలా మరమ్మతులు చేయాలని సైరిక్స్ వాళ్లను ఆదేశించారు. పోస్టుమార్టమ్‌కు డబ్బులు డిమాండ్ చేస్తే ఫిర్యాదు చేయడానికి మార్చురీ విభాగం వద్ద ఆర్‌ఎంఓలు, ఫోరెన్సిక్ విభాగం హెచ్ఓడీల ఫోన్‌నెంబర్లు ప్రదర్శిస్తామన్నారు. బాలింతల వార్డులో ఎవరైనా డబ్బులు డిమాండ్ చేసినా ఫిర్యాదు చేయడానికి అక్కడ కూడా ఆర్‌ఎంఓలు, గైనిక్ విభాగం హెచ్ఓడీల ఫోన్‌నెంబర్లు, సమాచార బోర్డులు ప్రదర్శిస్తామన్నారు. ఇక నుంచి ఎక్కడ ఫిర్యాదులు వచ్చినా వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని సూపరింటెండెంట్ హెచ్చరించారు.

గోళ్ల పంచాయతీకి జాతీయస్థాయి గుర్తింపు

స్వాతంత్ర్య దినోత్సవంలో పాల్గొనాల్సిందిగా సర్పంచ్‌కు ఆహ్వానం


కవితాబొజ్జన్న

కళ్యాణదుర్గం, ఆగస్టు 11: మండలంలోని గోళ్ల గ్రామ పంచాయతీకి జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. గ్రామ పంచాయతీని అభివృద్ధిలో అగ్రగామిగా నిలిపినందుకు ఎర్రకోటలో నిర్వహించనున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొనాల్సిందిగా సర్పంచ్ కవితకు పిలుపువచ్చింది. ఈ విషయాన్ని ఆదివారం ఎంపీడీఓలు సోలోమోన్, బాలాజీలు వెల్లడించారు. నిధుల కేటాయింపులో వైసీపీ ప్రభుత్వం విఫలమైనప్పటికీ సొంతనిధులు వెచ్చించి పంచాయతీని అభివృద్ధిపథంలో నడిపిస్తున్నట్లు అధికారులు ప్రత్యేక నివేదికలు పంపారు. గ్రామాల్లో రోడ్ల నిర్మాణాలు, వీధి దీపాలు, డ్రైనేజీల పరిశుభ్రత, సురక్షిత నీటిని అందజేయడంతో పాటు అనేక సామాజిక కార్యకలాపాల్లో తన వంతు కృషి చేస్తూ గోళ్ల పంచాయతీని రాష్ట్రంలో అగ్రగామిగా నిలిపింది. భర్త బొజ్జన్న సహకారంతో పంచాయతీ అభివృద్ధికి సాధ్యమైందని కవిత పేర్కొంది. గోళ్ల పంచాయతీకి రాష్ట్ర, జాతీయస్థాయిల్లో గుర్తింపునిచ్చిన ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రులు పయ్యావుల కేశవ్, సత్యకుమార్, సవిత, ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, కలెక్టర్ వినోద్‌కుమార్ తదితరులకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు వివరించారు.

9 గంటలు విద్యుత్ ఇవ్వాలి

విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఆవులదట్ల రైతుల ఆందోళన


ఆందోళన చేస్తున్న రైతులు

రాయదుర్గం రూరల్, ఆగస్టు 11: పంటలు ఎండిపోతున్నాయని, 9 గంటలు ఇవ్వాలని ఆవులదట్ల రైతులు ఆందోళనకు దిగారు. పది రోజులుగా రెండు గంటలు మాత్రమే ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం గ్రామంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద జాతీయ రహదారిపై రైతులు పెద్దసంఖ్యలో వచ్చి గంటపాటు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మరమ్మతుల పేరుతో 9 గంటలు ఇవ్వాల్సిన విద్యుత్‌ను కేవలం రెండు గంటలు మాత్రమే ఇస్తున్నారన్నారు. దీంతో పంటలు ఎండిపోతున్నాయన్నారు. తమ సమస్యను తెలిపేందుకు విద్యుత్ అధికారులకు ఫోన్ చేస్తున్నా లిఫ్ట్ చేయడంలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి 9 గంటల కరెంటును సరఫరా చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతులు కృష్ణ, రామాంజినేయులు, సోమలింగ, వెంకటేశులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

తెలుగునాడు వైద్య ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగరాజు


మాట్లాడుతున్న నాగరాజు

అనంతపురం టౌన్, ఆగస్టు 11: సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలుగునాడు వైద్యఉద్యోగుల ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు నాగరాజు పేర్కొన్నారు. ఆదివారం జిల్లాకేంద్రంలోని ఐఎంఏ హాల్‌లో ఆ సంఘ జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. సమావేశంలో నాగరాజు మాట్లాడుతూ వైద్య ఉద్యోగుల కుదింపు కోసం గత వైసీపీ ప్రభుత్వం జీవో 143, 32లను తీసుకొచ్చి తీవ్ర ఆందోళనకు గురిచేసిందన్నారు. బదిలీలలోను ఇష్టారాజ్యంగా వ్యవహరించి మానసికక్షోభకు గురిచేశారని ఆవేదన వ్యక్తం చేశారు. వైద్య ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం సానుకూలంగా ఉందన్నారు.

నూతన కమిటీ ఎంపిక: తెలుగునాడు ఉద్యోగులు సంఘం జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడు నాగరాజు ఆధ్వర్యంలో సత్యసాయి, అనంత జిల్లాల కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతజిల్లా అధ్యక్షుడిగా దేవి మల్లికార్జున, వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్. శివప్రసాద్, జనరల్ సెక్రటరీగా పీఎల్ మురళీక్రిష్ణ, కోశాధికారిగా శివయ్యను ఎన్నుకున్నారు.

తగ్గిన పశువుల సంత ఆదాయం

అనంతపురంరూరల్, ఆగస్టు 11: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో జరిగే పశువుల సంత ఆదాయం ఆదాయం తగ్గింది. ఈవారం సంతతో మార్కెట్‌కు రూ.2,69,480 ఆదాయం వచ్చిందని మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి జయలక్ష్మి ఆదివారం తెలిపారు. శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంత ద్వారా మార్కెట్‌కు రూ.1,59,180, ఆదివారం జరిగిన ఎనుములు, ఎద్దులు, ఆవుల సంతతో రూ.1,10,300 వచ్చిందని వివరించారు.

అమిగోస్ ఆగడాలు..!

- విచ్చలవిడిగా వసూళ్లు
- దొంగచేతికి వైసీపీ ప్రభుత్వం తాళాలు
- 78 చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి దందా
- రూ.800 కోట్లు కొల్లగొట్టిన మైనింగ్ మాఫియా
- దౌర్జన్యం, రౌడీయిజంతో బెదిరింపులు
- బిహార్‌ను తలపించిన అమిగోస్ వ్యవహారాలు
- పోలీసుల అండదండలు


జిల్లా మైన్స్ కార్యాలయం

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 11: సహజంగా లభించే ఖనిజ సంపదపై కన్నేసిన గత వైసీపీ ప్రభుత్వం అమిగోస్ మినరల్స్ సంస్థ ద్వారా దోచుకునేందుకు స్కెచ్ వేసింది. నాటి సీఎం జగన్, అప్పటి పెద్దమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి అత్యంత అనుయాయుడైన తిరుపతికి చెందిన వైసీపీ నేత ప్రసాద్‌రెడ్డితో అమిగోస్ మినరల్స్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థను స్థాపించారు. ఎలాంటి అనుభవం లేని సంస్థకు ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఖనిజ సంపదను కొల్లగొట్టేందుకు అధికారికంగా లైసెన్సు ఇచ్చేశారు. ఇదే అదనుగా అమిగోస్ సంస్థ ఇష్టానుసారంగా ప్రజలపై పడి పీక్కుతినడం ప్రారంభించింది. ప్రభుత్వానికి నామమాత్రంగా ఏడాదికి రూ.130 కోట్లు చెల్లించాలని షరతు పెట్టారు. అమిగోస్ మాత్రం ఏడాదిలోనే సుమారు రూ.800కోట్లు వరకు మైనింగ్ లీజు కాంట్రాక్టర్ల ద్వారా వసూలు చేసినట్లు తెలుస్తోంది. 2023 మార్చి నెలలోనే అమిగోస్ సంస్థతో అగ్రిమెంట్ కోసం ముగ్గురు మైనింగ్ శాఖ డీడీలను సైతం మార్చేశారు. బిహార్‌ను తలపించేలా అమిగోస్ సంస్థ రెండున్నరేళ్లలో బీభత్సం సృష్టించింది. మైన్స్ శాఖను తన గుప్పిట్లో పెట్టుకుని తన ఆగడాలను కొనసాగించింది.

అమిగోస్‌ను నడిపింది ఎవరంటే..?

అమిగోస్ మినరల్స్ ప్రైవేటు సంస్థ వైసీపీకి చెందిన నాయకులది. మాజీ సీఎం జగన్, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి అనుయాయుడు, కళ్యాణదుర్గం వైసీపీ ఎన్నికల ఇన్‌చార్జి, తిరుపతికి చెందిన వైసీపీ నేత, అనంతపురంలోని హుండాయ్ షోరూం ఓనర్ ప్రసాద్‌రెడ్డి ఎండీగా ఉన్న సంస్థే అమిగోస్ మినరల్స్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ. ఉమ్మడి అనంతపురం జిల్లాలో సహజసిద్ధమైన ఖనిజ సంపదను దోచుకోవడానికి వైసీపీ ప్రభుత్వం అమిగోస్ సంస్థకు ధారాదత్తం చేసింది. దొంగచేతికి తాళాలు ఇచ్చిన చందంగా ఖనిజ సంపదపై రాయల్టీ వసూలు లీజును అమిగోస్‌కు ఇచ్చింది. ఏడాదికి రూ.130కోట్ల చొప్పున రెండేళ్లకు రూ.260కోట్లు అమిగోస్ ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంది. ఇప్పటి వరకు కేవలం రూ.50కోట్లు మాత్రమే ప్రభుత్వానికి అమిగోస్ చెల్లించింది. మిగిలిన సుమారు రూ.210 కోట్ల బకాయి ఇంతవరకు చెల్లించలేదు.

కార్యాలయం సీజ్ చేసినా నిర్వహణ

అమిగోస్ మినరల్స్ సంస్థపై వచ్చిన అవినీతి, అక్రమాల ఆరోపణల నేపథ్యంలో జిల్లా మైన్స్ అధికారులు ఆ సంస్థ కార్యాలయాన్ని సీజ్ చేశారు. అప్పటికే విలువైన కీలక రికార్డులను అమిగోస్ సంస్థ ఇతర ప్రాంతాలకు తరలించినట్లు సమాచారం. సీజ్ చేసిన కార్యాలయంలో అమిగోస్ సంస్థకు సంబంధించిన సిబ్బంది రహస్యంగా రికార్డులను పరిశీలిస్తూ కార్యకలాపాలు కొనసాగిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం మారినా తమ పలుకుబడితే ఎవరినైనా కొనగలం అంటూ బీరాలు పలుకుతున్నారు. బాధిత లీజు కాంట్రాక్టర్లు తమకు రావాల్సిన వాటాల కోసం ధర్నాకు దిగారు. దీంతో వారిపైనే అమిగోస్ ప్రతినిధులు బ్లాక్‌మెయిలింగ్ కింద పోలీస్‌స్టేషన్‌లో కేసు పెట్టారు. ప్రతిగా బాధిత కాంట్రాక్టర్లు కేసు పెట్టారు. పోలీసులు కూడా అమిగోస్‌తో కుమ్మక్కయ్యారనే బాధిత కాంట్రాక్టర్లు బహిరంగంగానే ఆరోపణలు చేస్తున్నారు.


అమిగోస్ కార్యాలయం ఎదుట కాంట్రాక్టర్ల ఆందోళన (ఫైల్)

ముగ్గురు అధికారుల బదిలీ

2023 ఫిబ్రవరిలో జిల్లా గనులు భూగర్భశాఖ ఉపసంచాలకులుగా (డీడీ)గా కర్నూలు డీడీ తలారి రాజశేఖర్‌కు అప్పగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అమిగోస్ అగ్రిమెంట్‌పై డీడీ రాజశేఖర్ సంతకం చేయకపోగా ఇది నిబంధనలకు విరుద్ధంగా ఉంది...ఇలా చేయరాదని తిరస్కరించారు. దీంతో డీడీ బాధ్యతలు రాజశేఖర్‌ను తప్పించి వెంటనే అనంతపురం ఏడీగా ఉన్న తోట బాలసుబ్రహ్మణంకు అప్పగించారు. వారం రోజులు తిరక్కముందే ఇన్‌చార్జి డీడీగా ఉన్న ఆయన ఎండీఎల్‌కు సంబంధించి అగ్రిమెంట్‌ను తిరస్కరించారు. దీంతో ఆయనను వెంటనే సెలవుపై పంపించారు. ఈ క్రమంలోనే తాడిపత్రి ఏడీగా ఉన్న ఎంపరాల నాగయ్యకు ఇన్‌చార్జి డీడీగా నియమించారు. ఇలా అమిగోస్ సంస్థ ప్రభుత్వ శాఖలపై కూడా ఈ తరహాలో ప్రభావం చూపింది.

బహిరంగంగా ఖనిజ దోపిడీ

ఉమ్మడి జిల్లాలో లభించే ఖనిజ సంపదపై రాయల్టీ వసూలు లీజు అమిగోస్ మినరల్స్ సంస్థకు వైసీపీ ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా అప్పజెప్పింది. మట్టి, రాయి, గ్రానైట్, ఐరన్‌ఓర్, డోలమైట్ వంటి ఖనిజ సంపద తవ్వకాలు, రవాణాపై రాయల్టీ అధికమొత్తంలో వసూలు చేసింది. ఉమ్మడి జిల్లాలో సుమారు 78చెక్ పోస్టులను ఏర్పాటు చేసి, ఆ చెక్‌పోస్టులలో రౌడీలను, మారణాయుధాలతో ఏర్పాటు చేసి కాంట్రాక్టర్ల నుంచి రౌడీ మామూలు వసూలు చేయసాగింది. అసలు సంబంధమే లేని కంపెనీ ప్రజలపై పడి పీక్కుతినింది. జిల్లాలో సుమారు రూ.800కోట్లకు పైగా ఖనిజసంపద నుంచి రాయల్టీ పేరుతో వసూలు చేసినట్లు తెలుస్తోంది.

దౌర్జన్యంతోనే వసూళ్లు



ధనార్జన, దౌర్జన్యంతోనే అమిగోస్ మినరల్స్ సంస్థ జిల్లాలో వసూళ్లు చేసింది. అమిగోస్ సంస్థకు చెందిన ప్రసాద్‌రెడ్డి, జితేంద్ర, పద్మనాభరెడ్డి, రాజశేఖర్, ప్రవీణ్‌కుమార్, సునీల్‌కుమార్ ఉమ్మడి జిల్లాలో క్వారీలపై పడి పీక్కుతిన్నారు. క్వారీ లీజు కాంట్రాక్టర్లపై దౌర్జన్యం చేస్తూ విజిలెన్స్ దాడులు చేయిస్తూ రౌడీ ముఠాలను వెంటబెట్టుకుని టిప్పర్ల మీద దాడులు చేస్తూ భయభ్రాంతులకు గురిచేసి వసూళ్లకు పాల్పడ్డారు. ప్రశ్నించిన వారిపై అమిగోస్‌కు తొత్తుగా ఉన్న విజిలెన్స్ అడిషినల్ ఎస్పీ మునిరామయ్య, మైన్స్ డీడీ నాగయ్యను పంపి వేధించేవాళ్లు. మైన్స్ మొత్తాన్ని తన గుప్పెట్లో పెట్టుకుని వైసీపీ ప్రభుత్వంలో అమిగోస్ సంస్థ చేసిన ఆగడాలు అన్నిఇన్నీ కావు. వెంటనే అమిగోస్ సంస్థ యజమాన్యాన్ని అరెస్ట్ చేసి చీటింగ్, క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలి.

- చంద్రశేఖర్‌రెడ్డి, బాధిత లీజు కాంట్రాక్టర్

రోడ్డు మీదకు టిప్పర్ వస్తే జరిమానా



వైసీపీ ప్రభుత్వంలో క్వారీ, ఇతర మట్టి తరలింపునకు సంబంధించి టిప్పరు రోడ్డు మీదకు వస్తే కచ్చితంగా అమిగోస్ సంస్థ జరిమాన విధించేంది. అన్ని రకాల అనుమతులు ఉన్నప్పటికీ దౌర్జన్యంగా, బెదిరింపులకు పాల్పడి వసూళ్లు చేసేవారు. ఎవరికి చెప్పుకోవాలో అర్థంకాని పరిస్థితి. ప్రశ్నిస్తే సీఎం, పెద్దిరెడ్డి మంత్రి మావాళ్లే.. ప్రభుత్వం మొత్తం మాదే. మమ్మల్ని ఎవరూ ఏమీ చేయలేరు. బుద్ధిగా పెనాల్టీ కట్టిపోండి అని హెచ్చరించేవారు. మైన్స్ అధికారులకు, జిల్లా కలెక్టర్‌కు పదుల సంఖ్యలో ఫిర్యాదులు చేసినా ఫలితం శూన్యం. ఇప్పటికైనా బిహార్‌ను తలపించేలా వ్యవహరించిన అమిగోస్‌ను వెంటనే సీజ్ చేసి, యాజమాన్యాన్ని అరెస్ట్ చేసి జైలుకు పంపాలి.

- రాజేష్, కాంట్రాక్టర్, అనంతపురం

అమిగోస్ కార్యకలాపాలన్నీ ఆపేశారు



కొత్త ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి దాదాపు అమిగోస్ మినరల్స్ సంస్థకు చెందిన కార్యకలాపాలన్నీ నిలిపివేశాం. అమిగోస్ కార్యాలయాన్ని సీజ్ చేశాం. రికార్డులు ఎవరూ తీసుకుని పోకుండా నిఘా ఉంచాం. ఎంతటి వారినైనా ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా చేసిన వ్యవహారాలపై కఠిన చర్యలు తీసుకుంటుంది. అమిగోస్ సంస్థ చెల్లించాల్సిన రూ.83కోట్ల బకాయిలకు సంబంధించి ఇప్పటికే నోటీసులు జారీ చేశాం. ఇంతవరకు అమిగోస్ సంస్థ యాజమాన్యం నుంచి ఎలాంటి స్పందన రాలేదు. వాళ్లు ఇలాగే నిర్లక్ష్యం చేస్తే కచ్చితంగా రాష్ట్ర ప్రభుత్వం ఆ స్థాయిలో తగిన నిర్ణయం తీసుకుంటుంది.

- నాగయ్య, భూగర్భగనుల శాఖ డీడీ

ఆందోళనలో అన్నదాతలు

క్రస్ట్‌గేట్ కొట్టుకుపోవడంతో ఉలిక్కిపడ్డ రైతాంగం

అనంత జిల్లా తాగు, సాగునీటిపై తీవ్ర ప్రభావం


19వ గేట్ వద్ద నీటి ఉధృతి

రాయదుర్గం, ఆగస్టు 11: తుంగభద్ర జలాశయం క్రస్ట్ గేట్ కొట్టుకుపోయి, నీరంతా వృథాగా పోతుండటంతో జిల్లాలోని హెచ్చెల్సీ ఆయకట్టు రైతాంగం తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తోంది. తాగు, సాగుకు జీవనాధారంగా ఉన్న హెచ్చెల్సీపై దీని ప్రభావం తీవ్రంగా ఉండనుంది. నిండుకుండలా ఉన్న టీబీ డ్యాంను చూసి రెండు రాష్ట్రాల ప్రజలు, రైతులు ఆనంద పడ్డారు. అంతలోనే ఓ గేట్ కొట్టుకుపోయిన నీరంతా వృథాగా పోతుండటంతో వారంతా తీవ్ర ఆవేదన చెందుతున్నారు. జిల్లాలో ఉన్న కణేకల్లు, బొమ్మనహాళ్, విడపనకల్లు, ఉరవకొండలతో పాటు వివిధ ప్రాంతాల్లో పంటల సాగు చేయడానికి హెచ్చెల్సీ జలాలే జీవనాధారం. జలాశయం వద్ద నుంచి 105 కి.మీ. పొడవునా ప్రయాణించి ఆంధ్ర సరిహద్దులకు చేరడానికే కోట్లు ఖర్చు పెట్టి హెచ్చెల్సీని ఆధునికీకరించారు. సరిహద్దు నుంచి హెచ్ఎల్ఎంసీ, జీబీసీ ప్రాంతాల మీదుగా పీఏబీఆర్‌కు నీరు చేరి జిల్లాలోని అనంతపురం నగరంతో పాటు వివిధ ప్రాంతాలకు శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం ద్వారా తాగునీరు అందిస్తారు. ముఖ్యంగా హెచ్చెల్సీ ద్వారా 32 టీఎంసీలు వాటా రావాల్సి ఉండగా నీటి లభ్యతను బట్టి 26 టీఎంసీల దాకా నీరు ప్రతి ఏడాది అందుతున్నాయి. అందులో పది టీఎంసీల దాకా హెచ్చెల్సీ జలాలు తాగునీటికి వాడుకోవాల్సి ఉంటుంది. మిగిలిన జలాలను సాగు కోసం వినియోగించుకుంటారు. హెచ్చెల్సీ కాలువకు 15 రోజుల కిందట నీరు విడుదల చేసిన విషయం తెలిసిందే. ఇప్పటి వరకు రెండు టీఎంసీలు కూడా జిల్లాకు అందలేదు. ఈ నేపథ్యంలో ఒక్కసారిగా క్రస్ట్‌గేట్ చైన్‌లింక్ తెగిపోవడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది.

ఒక వైపు వరినాట్లు.. మరోవైపు తాగునీటి పంపింగ్

తుంగభద్ర ఎగువకాలువకు జలాశయం నుంచి 1500 క్యూసెక్కుల మేరకు సరిహద్దులో అందుతుండటంతో రైతులు ఆయకట్టులో వరినాట్లు సాగు చేయడంలో బిజీగా ఉన్నారు. కణేకల్లు, బొమ్మనహాళ్ మండలాలలో ఇప్పటికే డిస్ట్రిబ్యూటరీల కింద వరినారు సాగు ప్రక్రియ పూర్తి చేసి నాట్లు వేసే దశకు చేరుకుంటున్నారు. చివరి ఆయకట్టులో ఇప్పుడిప్పుడే వరినారు వేస్తున్నారు. పీఏబీఆర్ వద్ద ఉన్న శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం ద్వారా పంపింగ్ ప్రక్రియను ప్రారంభించారు. రాయదుర్గం, ఉరవకొండ లాంటి పట్టణాలకు తాగునీరు అందించేందుకు నిర్మించుకున్న సమ్మర్‌స్టోరేజ్ ట్యాంకులను నింపుకునే పనిలో భాగంగా కాలువ నుంచి నీటి పంపింగ్ ప్రక్రియ ప్రారంభించారు. వేసవిలో ఇబ్బంది లేకుండా ఉండటానికి తాగు నీటి అవసరాలకు పది టీఎంసీల మేరకు నీటిని కేటాయించారు. దీంతో ఓ వైపు పంపింగ్ ప్రక్రియ జరుగుతుండగా మరో వైపు వరినాట్లు సాగుతున్నాయి. ఈనేపథ్యంలో చైన్‌లింక్ తెగిపోయి క్రస్ట్ గేట్ కొట్టుకు పోవడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది.

వర్షాలు కురిస్తేనే..

సాధారణంగా జూలై నెలలో కురిసే వర్షాలతో జలాశయంలో నీరు మెండుగా చేరుకుని ఆగస్టు రెండోవారానికి జలాశయం పూర్తిగా నిండిపోతుంది. ఈ ఏడాది పెద్ద ఎత్తున వర్షాలు కురవడంతో ఎగువ నుంచి పెద్ద ఎత్తున వరదనీరు చేరి తక్కువ సమయంలోనే జలాశయం నిండిపోయింది. కాగా క్రస్ట్‌గేట్ తెగిపోవడంతో పూర్తిగా పరిస్థితులు, బోర్డు అధికారుల అంచనాలు మారిపోతున్నాయి. జలాశయం 100 టీఎంసీలకు మించి నీటి నిల్వతో నిండుకుండలా ఉండేది. దీంతో క్రస్ట్‌గేట్లను ఎత్తి 30 వేల క్యూసెక్కుల నీరు నదికి వదులుతూ ఉండేవారు. ఒక్కసారిగా క్రస్ట్ గేట్ తెగిపోవడంతో పరిస్థితులు తారుమారయ్యాయి. ఎగువ నుంచి నీటి లభ్యత క్రమేపీ తగ్గుముఖం పట్టి ఇన్‌ఫ్లో 25 వేల క్యూసెక్కులకు పడిపోయింది. రోజుకు ఒక టీఎంసీ మేరకు వివిధ కాలువల నుంచి ఆయా రాష్ట్రాల వాటా నీటిని విడుదల చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో క్రస్ట్‌గేట్ తెగిపోవడం పెద్ద దెబ్బ తగిలినట్లే. ఒకవైపు ఇన్‌ఫ్లో పూర్తిగా పడిపోవడం, మరో వైపు క్రస్ట్‌గేట్ ప్రభావంతో ఉన్ననీటిని దిగువకు వదిలేయాల్సిన పరిస్థితి. ఇలాంటి దశలో మరమ్మతులు పూర్తి చేసిన అనంతరం ఎగువన వర్షాలు కురిసి మళ్లీ డ్యాంకు నీరు చేరితే ఏ ఇబ్బందులు ఉండవు. ఒక వేళ వర్షాభావ పరిస్థితులు ఏర్పడితే పరిణామాలు భిన్నంగా ఉంటాయని రైతుల్లో ఆందోళన మొదలైంది. అయితే గతంలో ఆగస్టు చివరిలో కూడా వర్షాలు కురిసి జలాశయానికి సమృద్ధిగా నీరు చేరిన దాఖలాలు ఉండటంతో ఆందోళన చెందాల్సిన అవసరం లేదని బోర్డు అధికారులు భావిస్తున్నారు.

రెండు వాహనాల ఢీ... ఒకరి మృతి

ముగ్గురికి తీవ్రగాయాలు



దెబ్బతిన్న వాహనం, మృతిచెందిన మధుసూదన్ (ఫైల్)

చిలమత్తూరు, ఆగస్టు 11: ఎదురెదురుగా వస్తున్న రెండు వాహనాలు ఢీ కొనడంతో ఒకరు ప్రమాదస్థలంలోనే మృతి చెందగా, మరో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. ఏఎస్ఐ సుబ్రహ్మణ్యం వెల్లడించిన వివరాలిలా ఉన్నాయి. కర్ణాటకకు చెందిన మధుసూదన్, శ్రీనివాసులు, గౌరీకృష్ణ హిందూపురం వైపు నుంచి ఇన్నోవాలో ఆదివారం ఉదయం బెంగళూరు బయల్దేరారు. హిందూపురానికి చెందిన షెక్షావలి తన కారులో బెంగళూరు ఎయిర్‌పోర్టు నుంచి సొంతూరికి వస్తున్నాడు. 544-ఈ జాతీయ రహదారిలోని దేమకేతేపల్లి సమీపంలోకి రాగానే రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో ఇన్నోవా వాహనంలో ప్రయాణిస్తున్న కర్ణాటకకు చెందిన మధుసూదన్ (26) అక్కడికక్కడే మృతిచెందగా.. శ్రీనివాసులు, గౌరీకృష్ణకు తీవ్రగాయాలయ్యాయి. మరో వాహనదారుడు షెక్షావలి వాహనంలోనే ఇరుక్కుపోయాడు. స్థానికులు అతడికి బయటకు తీశారు. అతడి కాళ్లకు తీవ్రగాయాలయ్యాయి. ప్రమాదంలో మృతి చెందిన మధుసూదన్ కోలార్ జిల్లాలోని శ్రీనివాసపురం జిల్లా హెల్త్ అండ్ ఫ్యామిలి వెల్ఫేర్ జనరల్ ఆసుపత్రిలో ఆక్సిజన్ ప్లాంట్ టెక్నీషియన్‌గా పని చేస్తున్నట్లు తెలిపారు.

నీరా కోసం వచ్చి తిరిగిరాని లోకాలకు..

రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన మధుసూదన్, గాయపడిన శ్రీనివాసులు, గౌరీశంకర్ నీరా కోసం వచ్చినట్లు స్థానికులు తెలిపారు. వాహనంలో నీరా బాటిళ్లు లభించాయి. దీన్నిబట్టి చూస్తే హిందూపురం సమీపంలోని ఈత వనానికి వెళ్లి నీరా తీసుకెళ్తూ ప్రమాదం బారిన పడినట్లు తెలుస్తోంది.

ఏపీఎస్ఆర్టీసీ బస్సు బోల్తా

పలువురికి గాయాలు

చిలమత్తూరు, ఆగస్టు 11: పుట్టపర్తి ఆర్టీసీ డిపోకి చెందిన బస్సు కర్ణాటకలోని 44వ జాతీయ రహదారిపై బాగేపల్లి సమీపంలోని చుండూరు క్రాస్ వద్ద ఆదివారం మధ్యాహ్నం అదుపుతప్పి బోల్తా పడింది. ప్రమాదంలో బస్సులోని ఇద్దరు డ్రైవర్లతోపాటు ఇద్దరు ప్రయాణికులకు తీవ్రగాయాలయ్యాయి. మిగిలిన ప్రయాణికులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. పుట్టపర్తి డిపోకి చెందిన ఆర్టీసీ బస్సు బెంగళూరు నుంచి పుట్టపర్తికి వస్తోంది. బాగేపల్లి సమీపంలోని చుండూరు క్రాస్ వద్దకు రాగానే బస్సు స్టీరింగ్ పనిచేయక అదుపుతప్పింది. డ్రైవర్ బాబయ్య కంట్రోల్ చేయడానికి ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. బస్సు రోడ్డు పక్కన ఉన్న గుంతలోకి పడింది. ప్రమాదంలో డ్రైవర్ బాబయ్యతో పాటు మరో డ్రైవర్ లోకేశ్వరయ్య, ఇద్దరు ప్రయాణికులకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని బాగేపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స కోసం తరలించారు. డ్రైవర్ లోకేశ్వరయ్య తలకు తీవ్రమైన గాయం కావడంతో మెరుగైన చికిత్స కోసం అనంతపురం తరలించారు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు, కర్ణాటక పోలీసులు అక్కడికి చేరుకొని ప్రయాణికులను బస్సులో నుంచి సురక్షితంగా బయటికి తీసుకొచ్చారు. ప్రమాద సమయంలో 13 మంది ప్రయాణికులు ఉన్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు.



బోల్తా పడ్డ ఏపీఎస్ ఆర్టీసీ బస్సు, గాయపడిన డ్రైవర్ లోకేశ్వరయ్య

ఆసుపత్రి ఎదుట ఆందోళన

వైద్యుల నిర్లక్ష్యంపై మృతుడి కుటుంబీకుల నిరసన



ఆసుపత్రి ఎదుట ధర్నా చేస్తున్న మృతుడి కుటుంబసభ్యులు, బంధువులు, అరవింద్ (ఫైల్)

గుంతకల్లుటౌన్, ఆగస్టు 11: తమ కుమారుడు అరవింద్ (24) వైద్యుల నిర్లక్ష్యం వల్లే మృతి చెందాడని స్థానిక 60 అడుగుల రోడ్డులోని ఓ ప్రైవేటు ఆసుపత్రి వద్ద మృతుడి కుటుంబసభ్యులు, బంధువులు ఆదివారం ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత నెల 29న కిడ్నీలో రాళ్లు ఉన్నాయని ఆసుపత్రిలో చేరాడన్నారు. పరీక్షలు నిర్వహించిన అనంతరం వారం రోజులపాటు అడ్మిట్ చేసుకుని ట్రీట్‌మెంట్ ఇచ్చి ఈనెల 5న కర్నూలుకు వెళ్లాలని సూచించారని తెలిపారు. అక్కడ ట్రీట్‌మెంట్ తీసుకుని అనంతరం హైదరాబాదులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లాడన్నారు. కిడ్నీ ఇన్‌ఫెక్షన్ అయి షుగర్ లెవెల్స్ పెరిగి మృతిచెందాడన్నారు. దాదాపు రూ. 6లక్షలు వైద్యం కోసం ఖర్చు చేయడం జరిగిందని వివరించారు. తమ కుమారుడు వైద్యుల నిర్లక్ష్యం వల్లే మృతిచెందాడని ఆసుపత్రి ఎదుట రోడ్డుపై బైఠాయించి ధర్నా చేశారు. సమాచారం అందుకున్న వన్‌టౌన్, టూటౌన్ సీఐలు రామసుబ్బయ్య, గణేష్, రూరల్ ఎస్ఐ సురేష్ ఘటనా స్థలానికి చేరుకుని మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులతో మాట్లాడారు. వైద్యులతో మాట్లాడి న్యాయం చేస్తామని చెప్పడంతో వారు ఆందోళన విరమించారు.

ఆంధ్ర సౌత్‌జోన్ జట్టుకు నలుగురి ఎంపిక


ధారామోహన్ | తేజస్విని | మాన్విత | చక్రిక దండు

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 11: ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ సౌత్‌జోన్ బాలికల అండర్-15 క్రికెట్ జట్టుకు జిల్లాకు చెందిన నలుగురు ఎంపికయ్యారు. చక్రిక దండు, ధారామోహన్, మాన్విత, తేజస్విణి ఏసీఏ సౌత్‌జోన్ అండర్-15 బాలికల క్రికెట్ జట్టులో చోటు సాధించారు.

జీడిపల్లి రిజర్వాయర్‌కు ఆగిన ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, ఆగస్టు 11: రాగులపాడు పంప్‌హౌస్‌లో తలెత్తిన సాంకేతిక కారణాలతో రెండు మోటార్లు ఆఫ్ చేయడంతో జీడిపల్లి రిజర్వాయర్‌కు ఆదివారం ఇన్‌ఫ్లో ఆగినట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 0.263 టీఎంసీల నీరు నిల్వ వుందని సోమవారం నుంచి కృష్ణా జలాలను విడుదల చేయడం జరుగుతుందని అధికారులు పేర్కొన్నారు.

అకడమిక్ కన్సల్టెంట్ పోస్టులకు ఇంటర్వ్యూలు

అనంతపురం సెంట్రల్, ఆగస్టు 11: ఎస్కేయూలోని పలువిభాగాల్లో పాఠ్యాంశాలను బోధించేందుకు అకడమిక్ కన్సల్టెంట్ పోస్టులకు ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ అనిత ఆదేశాలమేరకు ప్రిన్సిపాల్ కృష్ణకుమారి నోటిఫికేషన్ జారీచేశారని ఆదివారం పీర్వో ప్రొఫెసర్ రామగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 సంవత్సరానికి సైన్స్ విభాగంలో బయోకెమిస్ట్రీ, బోటనీ, కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్, జియోగ్రఫీ, ఇన్‌స్ట్రుమెంటేషన్, ఎలక్ట్రానిక్స్, మ్యాథమెటిక్స్, మైక్రోబయోలజీ, ఫిజిక్స్, పాలిమర్ సైన్స్, సెరికల్చర్, జువాలజీ, ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్టాటిస్టిక్స్ డిపార్ట్‌మెంట్స్‌లో ఖాళీలు ఉన్నాయన్నారు. ఆర్ట్స్ డిపార్ట్‌మెంట్స్‌లో ఎకనామిక్స్, ఇంగ్లీష్, తెలుగు, కామర్స్, లైబ్రరీ సైన్స్, అడల్ట్ ఎడ్యుకేషన్, లా, రూరల్ డెవలప్‌మెంట్, సోషల్‌వర్క్, హిస్టరీ, ఎంబీఏ, పొలిటికల్ సైన్స్ అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగాల్లో పని చేసేందుకు అకడమిక్ కన్సల్టెంట్స్ పోస్టులకు వాక్ ఇన్ ఇంటర్వ్యూలను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఎంపికైన అభ్యర్థులకు గంటల కొలమాన ప్రకారం జీతం ఉంటుందన్నారు. 13, 14తేదీల్లో ఆయా విభాగాల్లో నిర్వహించే ఇంటర్వ్యూలకు ఆసక్తి గల అభ్యర్థులు సర్టిఫికెట్స్‌తో హాజరుకావాలని కోరారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి ప్రత్యేక పూజలు



అలంకరణలో స్వామివారు

ఆత్మకూరు, ఆగస్టు 11: మండలంలోని పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం మాఘ మాస ప్రత్యేక పూజలు వైభవంగా నిర్వహించారు. శ్రావణమాసం మెదటి ఆదివారం కావడంతో జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. స్వామివారికి క్షీరాభిషేకం, పంచామృతాభిషేకం తదితర పూజలు నిర్వహించారు. 108 ద్రవ్యాలతో విశేష అభిషేకాలు చేశారు. అనంతరం స్వామివారికి బంగారు కవచ అలంకరణ, అర్చన, ఆకుపూజ, మహానైవేద్యం సమర్పించారు. భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి అక్కిరెడ్డి, ప్రధాన అర్చకులు రాముస్వామి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా సుంకులమ్మ విగ్రహ ప్రతిష్ఠ



పూజల్లో పాల్గొన్న ముంటిమడుగు కేశవరెడ్డి, రామలింగారెడ్డి

గార్లదిన్నె, ఆగస్టు 11: మండలంలోని కల్లూరు కొండకింద కొట్టాలలో సుంకులమ్మ విగ్రహ ప్రతిష్ఠ కన్నులపండువగా జరిగింది. కొండకింద కొట్టాలలో రూ.40 లక్షలతో సుంకులమ్మ దేవాలయం నిర్మించారు. ఆదివారం విగ్రహప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించారు. తెల్లవారుజామున అర్చకులు వివిధ పూజా కార్యక్రమాలు చేశారు. అనంతరం అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ చేశారు. భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. సుంకులమ్మ అమ్మవారిని టూమెన్ కమిటీ సభ్యుడు ముంటిమడుగు కేశవరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రామలింగారెడ్డి దర్శించుకున్నారు.

చారిత్రక సంపదను పరిరక్షించుకోవాలి

● కలెక్టర్ వినోద్‌కుమార్



పురావస్తు ప్రదర్శనను తిలకిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం కల్చరల్, ఆగస్టు 11: జిల్లాలోని చారిత్రక సంపదను పరిరక్షించుకోవాలని కలెక్టర్ వినోద్‌కుమార్ అన్నారు. ఆదిమూర్తినగర్‌లోని పురావస్తు ప్రదర్శనశాలను ఆదివారం కలెక్టర్ సందర్శించారు. ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని ప్రతి గ్రామ, మండల, మున్సిపల్ ఏరియాలు, పొలాలు, నదీ ప్రదేశాల్లోని చారిత్రక ప్రాధాన్యం కలిగిన రాతి విగ్రహాలు, పనిముట్లు, వస్తువులను గుర్తిస్తే పురావస్తుశాఖకు సమాచారం అందజేసి, స్వచ్ఛందంగా అప్పగించేందుకు సహకరించాలన్నారు. భారత పౌరులుగా బాధ్యతతో ప్రాచీన సంపద, ప్రాచీన కలల గురించి భావితరాలకు అందజేయాల్సిన అవసరముందన్నారు. కార్యక్రమంలో పురావస్తుశాఖ ఏడీ రజిత, అసిస్టెంట్ మహేంద్రనాయుడు, టైపిస్ట్ గంగా నరే‌ష్‌బాబు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయాలకు బోర్డుల ఏర్పాటు



తహసీల్దార్ కార్యాలయాలకు ఏర్పాటు చేసిన నూతన బోర్డులు

అనంతపురంరూరల్, ఆగస్టు 11: అనంతపురం అర్బన్, రూరల్ మండలాలకు వేరువేరుగా తహసీల్దార్ కార్యాలయాలు ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. హెచ్ఎల్‌సీ కాలువ సమీపంలోని ఉన్న కార్యాలయంలోనే వేరువేరుగా కార్యాలయాలను ఏర్పాటు చేసి పనులు కార్యకలాపాలు సాగిస్తున్నారు. రెండు కార్యాలయాలు ఓకేచోట ఉండటంతో కొంత ప్రజలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈసమస్యకు కొత్త అధికారులు పరిష్కరించారు. ఈమేరకు నూతన బోర్డులను ఏర్పాటు చేశారు.

వయనాడ్ మృతులకు నివాళి



కొవ్వొత్తులతో నివాళి అర్పిస్తున్న విద్యార్థినులు

శింగనమల, ఆగస్టు 11: వయనాడ్ దుర్ఘటనలో మృతి చెందిన వారి ఆత్మలకు శాంతి కలగాలని శింగనమల కేజీబీవీ విద్యార్థులు, హరిత దివ్యాంగుల సేవాసమితి ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నివాళి అర్పించారు. ఆదివారం రాత్రి హరిత దివ్యాంగుల సేవాసమితి రాష్ట్ర అధ్యక్షుడు మోహన్‌నాయక్ మాట్లాడుతూ వయనాడ్‌లో కొండచెరియలు విరిగిపడి 500 మందిపైగా మృతి చెందడం బాధాకరమన్నారు.

భక్తిశ్రద్ధలతో దుర్గాపూజ



శివాలయంలో దుర్గా పూజ చేస్తున్న వేద పండితులు

మడకశిర రూరల్, ఆగస్టు 11: మండలంలోని ఆమిదాలగొంది గ్రామంలో వీరశైవ లింగాయత్ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన శివాలయంలో ప్రతిష్ఠ ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తు న్నారు. అందులో భాగంగా ఆదివారం ఆలయంలో దుర్గాదేవత పూజను ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గంలోని వీరశైవ లింగాయత్‌లు అందరూ పాల్గొని అమ్మవారికి పూజలు చేసి, మొక్కులు తీర్చుకున్నారు. అలాగే సోమవారం శివాలయంలో ప్రాణ ప్రతిష్ఠ, కుంభాభిషేకం, విమాన గోపుర కలశ స్థాపన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీసభ్యులు తెలిపారు.

సర్వం కోల్పోతాం..!

- రోడ్డు విస్తరణపై పాపంపేట వాసుల ఆందోళన
- నాలుగు దశాబ్దాలకుపైగా నివాసం..
- ఏనాడూ విస్తరణ ప్రస్తావన లేదంటూ ఆవేదన
- ప్రజాప్రతినిధులు తలచుకుంటే సమస్య పరిష్కారం

అనంతపురంరూరల్, ఆగస్టు 11: అక్కడున్న వారిలో చాలామంది పేద, మధ్యతరగతి కుటుంబాల వారే. దశాబ్దాల కాలంగా చిన్న చిన్న వ్యాపారాలు, కూలీపనులకు వెళుతూ జీవనం సాగిస్తున్నారు. రోడ్డు విస్తరణ కబురు వారికి కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. ఎప్పుడు ఎలాంటి వార్తను వినాల్సివస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. మండలంలోని బళ్లారిరోడ్డు-కళ్యాణదుర్గంరోడ్డు మధ్య ఉన్న పాపంపేట ప్రధాన లింక్ రోడ్డు విస్తరణకు ప్రతిపాదనలు పంపినట్లు తెలుస్తోంది. ఆ మేరకు 2022లో రోడ్డు విస్తరణ అనుమతులు కూడా వచ్చినట్లు ఆయా వర్గాల ద్వారా తెలుస్తోంది. ఈక్రమంలోనే ఇటీవల రోడ్డు విస్తరణ అంశాన్ని అహుడా అధికారుల ద్వారా స్థానికులకు తెలిసింది. ఈ విషయం ప్రస్తుతం స్థానికంగా నివాసముంటున్న వారిని ఆందోళనకు గురిచేస్తోంది. ఏళ్ల తరబడి స్థానికంగా నివాసముంటున్నాం. ఎన్నడూ రోడ్డు విస్తరణ ప్రస్తావన లేదు. ఇప్పుడు రోడ్డు విస్తరణ మాట వింటున్నాం. ఇదే జరిగితే తాము సర్వం కోల్పోవాల్సిందే. ఇలా జరగకుండా ప్రస్తుత ప్రజా ప్రతినిధులు చొరవ చూపితే మేలు చేసినవారవుతారని స్థానికులు చెబుతున్నారు.

బండి జాడ నుంచి.. 30అడుగులకు విస్తరణ

పాపంపేట ప్రాంతం 1978 నుంచి 1980 మధ్య ఏర్పాటైనట్లు స్థానికుల ద్వారా తెలుస్తోంది. అప్పట్లో అడవిలా ఉండేదంటున్నారు. ఒక్కొక్కరుగా వచ్చి గుడిసెలు వేసుకుని జీవనం సాగించడం మొదలు పెట్టారు. బళ్లారి- కళ్యాణదుర్గం రోడ్డు మధ్య ఉన్న పాపంపేట ప్రధాన లింకురోడ్డుగా చెప్పుకుంటున్న రోడ్డు మొదట్లో బండిజాడగా ఉండేది. కాలక్రమేణా బండి జాడ కాస్త 30 అడుగుల రోడ్డుగా మారింది. దీని వలన ఎవరికీ ఇబ్బంది కూడా లేదు. అయినా ప్రస్తుతం రోడ్డు విస్తరణ చేయాలంటున్నారు. లింకు రోడ్డుకు రెండు వైపులా 70 ఇళ్లకుపైగా ఉంటున్నాయి. ఇందులో ఎక్కువగా పేద, మధ్యతరగతి కుటుంబాలకు సంబంధించిన ఇళ్లే ఉన్నాయి. ఇలాంటి వారికి సంబంధించి 40కిపైగా ఉన్నట్లు తెలుస్తోంది. రోడ్డు విస్తరణ జరిగితే వారంతా చాలావరకు ఇళ్లను కోల్పోయే అవకాశం ఉంది. రోడ్డు విస్తరణ ప్రస్తావన తెలిసినప్పటి నుంచి ఆయా కుటుంబ సభ్యులు ఆందోళనకు గురవుతున్నారు. ఇళ్లు కోల్పోతే మా పరిస్థితి కొండగుట్టల పాలు కావాల్సిందేనని వాపోతున్నారు.



కళ్యాణదుర్గం-బళ్లారి రోడ్ల మధ్యలోని పాపంపేట లింక్‌రోడ్డు

ఎమ్మెల్యే దృష్టికి రోడ్డు విస్తరణ సమస్య..

పాపంపేట రోడ్డు విస్తరణ సమస్యను ఇటీవల టీడీపీ నాయకులు ఎమ్మెల్యే పరిటాల సునీత దృష్టికి తీసుకెళ్లారు. ప్రస్తుతమున్న 30 అడుగుల రోడ్డు వలన స్థానికంగా నివాసముంటున్న వారికి ఎలాంటి ఇబ్బందులు లేవని వివరించారు. రోడ్డు విస్తరణ జరిగితే కలిగే నష్టాన్ని వివరించారు. రెండు రోజుల క్రితం నాయకులతో కలసి అహుడా అధికారులతో ఎమ్మెల్యే చర్చించారు. రోడ్డు విస్తరణ జరిగితే చాలా మంది పేదలు ఇళ్లు కోల్పోయే ప్రమాదం ఉందని, దీనిని పరిగణలోకి తీసుకోవాలని సూచించారు. అహుడా అధికారులు కనీసం 40 అడుగులైనా రోడ్డు ఉండాలని ప్రతిపాదించగా అన్ని విధాలా మరోసారి పరిశీలించి ప్రజలకు ఇబ్బంది లేకుండా నిర్ణయం తీసుకుందామని ఎమ్మెల్యే చెప్పారు.

ఎవరి కళ్లు మామీదపడ్డాయో?



నలభైఏళ్లుగా స్థానికంగా ఉంటున్నాం. నా భర్త కూరగాయల వ్యాపారం చేస్తున్నాడు. కొడుకు పంచర్‌షాపు నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాం. మేము వచ్చినప్పటికీ రాముల విగ్రహాలు రెండు బండల మధ్య ఉండేవి. ఆయన మీదే భారం వేసి నివాసమున్నాం. మాలాంటి వాళ్లపైనా ఎవరి కళ్లు పడ్డాయో ఏమో? ఇప్పుడు రోడ్డు వెడల్పు చేస్తారంటున్నారు. ఇదే జరిగితే మా కుటుంబం రోడ్డున పడాల్సిందే.

- పద్మావతి, స్థానికురాలు

ఈ ఇల్లే ఆధారం



మేము ఇక్కడికొచ్చి నలభైఏళ్లు గడిచిపోయింది. అప్పట్లో ఈ ప్రాంతమంతా ముళ్లకంపలతో అడవిలా ఉండేది. వాటిని తొలగించి గుడిసెలు వేసుకుని జీవనం సాగిస్తూ వచ్చాం. ఉన్న స్థలంలోనే కొంత కొడుకులకు ఇచ్చి మిగిలిన దానిలో టీ కొట్టు పెట్టుకుని బతుకుతున్నా. ఈ ఇల్లే ఆధారం. రోడ్డు విస్తరణలో ఉన్న ఇల్లు పోతే చెట్లగుట్టల పాలు కావాల్సిందే.

- ఖాసీం, స్థానికుడు

అప్పులు చేసి ఇల్లు కట్టుకున్నాం



కాలనీ ఏర్పాటైనప్పటి నుంచి ఉంటున్నాం. మొదటి నుంచి ఇబ్బందులు పడుతూనే జీవనం సాగించాం. టైలరింగ్ పనిచేస్తూనే చిన్న ఇల్లు కట్టుకుని నివాసముంటూ వచ్చాను. పిల్లలు కొంత ప్రయోజకులు కావడంతో ఈ మధ్యనే బ్యాంకులోన్, కొంత అప్పు చేసి ఇల్లు కట్టుకుంటున్నాం. ఇంతలోనే రోడ్డు విస్తరణ జరుగుతుందని, ఇల్లు పోతుందంటున్నారు. ఈ ఇల్లు తప్పా..మరో ఆదరువు లేదు. ఏమి చేయాలో అర్థం కావడం లేదు.

- గౌసపీర్, స్థానికుడు

సచివాలయ వ్యవస్థలో మార్పులపై చర్చించాలి

● సంఘం రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీనారాయణ



మాట్లాడుతున్న సచివాలయ ఉద్యోగుల సంఘం కార్యదర్శి లక్ష్మీనారాయణ

అనంతపురం అర్బన్, ఆగస్టు 11: గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థలో మార్పులపై ఉద్యోగ సంఘాలతో ప్రభుత్వం సమావేశాన్ని నిర్వహించి చర్చించిన తర్వాత తగు నిర్ణయం తీసుకోవాలని సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీనారాయణ సూచించారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కార్యాలయంలో గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగుల సంఘం నాయకులతో అత్యవసర సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగాల రూపకల్పన చేసినప్పటికీ ఉద్యోగుల విధివిధానాలు, జాబ్ చార్ట్, ఉద్యోగోన్నతి, తదితర అంశాలపై నిర్ణయాలు తీసుకోవడంలో విఫలమైందన్నారు. సచివాలయ ఉద్యోగులపై కొందరు అధికారులు వివక్ష చూపుతూ సంబంధంలేని పనులు చేయిస్తున్నారన్నారు. పలు రకాల వింత నిబంధనలు విధించి షోకాజ్‌లు, మెమోల పేరుతో ఉద్యోగులను ఇబ్బందులు పెడుతున్నారన్నారు. గ్రామ సచివాలయాల రేషనలైజేషన్, క్లస్టర్ విధానం అమలు, ఉద్యోగుల రేషనలైజేషన్ తదితర ప్రతిపాదనలు కూటమి ప్రభుత్వం తెరపైకి తేవడంతో ఏం జరుగుతుందోనని సిబ్బంది ఆందోళన చెందుతున్నారన్నారు. ఏ ఉద్యోగులను ఎక్కడ సర్దుబాటు చేస్తారో తెలియక అయోమయంలో కొట్టుమిట్టాడుతున్నారన్నారు. సచివాలయ ఉద్యోగుల సంఘాల నాయకులతో ప్రభుత్వ పెద్దలు ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి, కొత్త నిర్ణయాలపై సమాలోచనలు జరిపి అందరికీ ఆమోదయోగ్యమైన నిర్ణయాలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సచివాలయ ఉద్యోగులకు ఉద్యోగోన్నతి కల్పించడంతోపాటు మాతృ శాఖలకు అనుసంధానం చేయాలన్నారు. రెండు సంవత్సరాల ప్రొబేషన్ కాలాన్ని పరిగణలోకి తీసుకొని ఇంక్రిమెంట్లు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. మెరుగైన భవిష్యత్, హక్కుల సాధన కోసం పోరాడేందుకు సచివాలయ ఉద్యోగులు అందరూ ఏకమై కలిసి రావాల్సిన అవసరం ఉందన్నారు. శివశంకర్, హనుమంతు, నరసింహ, మహేష్, రామాంజనేయులు, హనుమంతరెడ్డి, భగీరథరెడ్డి, ఈశ్వర్, ముత్యాలు, మణిదీప్, ధనుంజయ పాల్గొన్నారు.

బాధితుడికి ఆర్థికసాయం



బాధిత కుటుంబానికి రూ.76వేల నగదు అందజేస్తున్న దాతలు

అనంతపురం సెంట్రల్, ఆగస్టు 11: అనారోగ్యానికి గురై వైద్యం చేయించుకోలేని బాధితునికి దాతలు రూ.76వేల ఆర్థికసాయాన్ని అందజేసి వారి సేవా నిరతిని చాటుకున్నారు. ఆదివారం అనంత స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు బాధితుడి వద్దకెళ్లి రూ.76వేల నగదును అందజేశారు. ఆయా సంస్థల ప్రతినిధులు లాల్‌బాషా, బాలకృష్ణ, సుజాత మాట్లాడుతూ ఆత్మకూరు మండలం వై.కొత్తపల్లికి చెందిన రైతుకూలీ లారీ ప్రమాదానికి గురికావడంతో అచేతన వ్యవస్థలోకి వెళ్లారన్నారు. ఆపరేషన్‌కోసం రూ.5 లక్షల వరకు ఖర్చు అవుతుందని డాక్టర్లు చెప్పడంతో బాధిత కుటుంబ సభ్యులు తమను సంప్రదించారన్నారు. తమవంతుగా ఆర్థికసాయం అందించినట్లు పేర్కొన్నారు. ప్రతినిధులు చంద్రశేఖర్, నరేష్, రంజిత్, అమర్, నాగరాజు పాల్గొన్నారు.

చేనేత కార్మికులను ఆదుకోవాలి

తోపుడు బండిపై మగ్గంతో నిరసన ర్యాలీ

ధర్మవరం, ఆగస్టు 11: ప్రభుత్వాలు చేనేత కార్మికులకు గతంలో అందించే పథకాలను పునరుద్ధరించి.. ఆదుకోవాలని చేనేత కార్మికులు కోరారు. ఈ మేరకు ఆదివారం సాయంత్రం తోపుడు బండిపై చేనేత మగ్గం ఉంచి కొత్తపేట సర్కిల్‌లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం చేనేత కార్మికుడు చింతా శ్రీనివాసులు మాట్లాడుతూ.. ధర్మవరంలో చేనేత కార్మికులు గతం లో వేలాది మంది చేనేత వృత్తిపై ఆధారపడి జీవించేవారన్నారు. అయితే రానురాను చేనేత పరిశ్రమ కుదేలైందన్నారు. రాజకీయ నాయకులు, అధికారులు మేల్కొని చేనేతలను ఆదు కోవాలని కోరారు. ఈమధ్యకాలంలో పవర్‌లూమ్స్ యజమానులు కూడా దెబ్బతింటున్నార న్నారు. కావున చేనేత పరిశ్రమకు పూర్వవైభవాన్ని తీసుకొచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు.

ఎమ్మార్పీఎస్ సంబరాలు

అనంతపురంరూరల్, ఆగస్టు 11: ఎస్సీ వర్గీకరణ అంశం సుప్రీంకోర్టు తీర్పును హర్షిస్తూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మండలంలోని అక్కంపల్లి పంచాయతీ ధర్మభిక్షం కాలనీ, ఎన్ఆర్ కాలనీలో ఆదివారం సంబరాలు చేసుకున్నారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ బీసీఆర్ దాస్ ఆధ్వర్యంలో కేక్‌కట్ చేసి, ఆనందం పంచుకున్నారు. మందకృష్ణ మదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఎస్సీ వర్గీకరణ సాధన కోసం పనిచేసి ప్రాణాలు కోల్పోయిన వారికి పూలమాలలు వేసి, నివాళి అర్పించారు. కార్యక్రమంలో నాయకులు రాము, నాగేంద్ర, నరసింహులు, నల్లప్ప, సుబ్రహ్మణ్యం, నాగేంద్ర, మున్నా, రాయుడు, సుదర్శన్, శ్రీకాంత్, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

ముగిసిన జిల్లా స్థాయి చెస్ పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న అధ్యక్షుడు

ధర్మవరం, ఆగస్టు 11 : ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ యూటీఎఫ్ స్వర్ణోత్సవ సంబరాల్లో భాగంగా రెండు రోజులుగా కాకతీయ విద్యానికేతన్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి చెస్ పోటీలు ఆదివారం ముగిశాయి. ఈ చెస్ పోటీల్లో మహిళా టీచర్స్ విభాగంలో అమలాపురానికి చెందిన సబిహాభాను, ఎన్‌పీకుంటకు చెందిన సీతారత్నం, ధర్మవరానికి చెందిన దుర్గా, మహేశ్వరి విజేతలుగా నిలిచారు. అలాగే పురుష టీచర్స్ విభాగంలో కొత్తచెరువు మండలం కేశాపురానికి చెందిన శివకృష్ణ, గుడిబండకు చెందిన జయచంద్ర, లేపాక్షికి చెందిన శ్రీనివాసరెడ్డి, సీకేపల్లికి చెందిన లక్ష్మీనారాయణస్వామి విజేతలుగా నిలిచారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శెట్టిపి జయచంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి సుధాకర్, ఉపాధ్యక్షుడు జీహెచ్‌బాబు, ఆడిట్ కమిటి సభ్యుడు రామకృష్ణ నాయక్, సీనియర్ నాయకులు నారాయణస్వామి, చెన్నకేశవులు విజేతలకు మెమెంటోలు, బహుమతులు అందజేశారు. ఈ విజేత ఉపాధ్యాయులు సెప్టెంబరులో గుంటూరులో జరిగే రాష్ట్ర స్థాయి యూటీఎఫ్ స్వర్ణోత్సవాల పోటీల్లో పాల్గొనే అర్హత సాధించారని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయ నిర్ణేతలు ఆదిరత్నకర్, కిశోర్ కుమార్,సోమశేఖరప్రసాద్, పీడీలు రమేశ్, నాగేంద్ర పాల్గొన్నారు.

చెత్తతొట్టె ఎక్కిన ట్రాన్స్‌ఫార్మర్..!

- విద్యుత్‌శాఖ పనితీరుకు నవ్విపోతున్న జనం
- పొంచివున్న ప్రమాదంతో స్థానికుల్లో ఆందోళన

ఓ ట్రాన్స్‌ఫార్మర్ చెత్త తొట్టే ఎక్కింది. ఇదేంటి ట్రాన్స్‌ఫార్మర్ చెత్త తొట్టి ఎక్కడమేంటి అనుకుంటున్నారా.. అవును మరి విద్యుత్‌శాఖ పనితీరు అలా ఉంది. ఈ చిత్రమే ఇందుకు నిదర్శనం. జిల్లా కేంద్రంలోని హౌసింగ్ బోర్డు బుద్ధవిహార్ పార్కు రోడ్డులో రెండు నెలల కిందట విద్యుత్ శాఖ ఓ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసింది. వాస్తవానికి ఎక్కడైనా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుచేయాలంటే దిమ్మె కట్టి ఏర్పాటు చేస్తారు. ఇక్కడ మాత్రం తాత్కాలికానికి ఏర్పాటు చేశారా.. లేక శాశ్వతంగా ఏర్పాటు చేశారో తెలియదుకానీ.. ఓ చెత్త తొట్టి మీద ఏర్పాటు చేశారు. దీనిని ఏర్పాటు చేసి దాదాపు రెండు నెలలు దాటిపోయింది. అటుగా వెళ్లిన వారు దాన్ని చూసి నవ్వుకుంటున్నారు. చెత్తతొట్టె ఎక్కిన ట్రాన్స్‌ఫార్మర్ అంటూ మాట్లాడుకుంటున్నారు. స్థానికులు మాత్రం ఆ ట్రాన్స్‌ఫార్మర్ చూసి భయపడిపోతున్నారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్థానికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని సమస్యకు పరిష్కరం చూపాలని కోరుతున్నారు.

- అనంతపురంరూరల్



చెత్త తొట్టెపై ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్

ఎమ్మెల్యే పరిటాల సునీతను కలిసిన విద్యాకమిటీ సభ్యులు



పరిటాల సునీతకు పుష్పగుచ్ఛం అందిస్తున్న విద్యాకమిటీ సభ్యులు

ఆత్మకూరు, ఆగస్టు 11: స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యాకమిటీ సభ్యులు ఆదివారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పరిటాల సునీతను మర్యాదపూర్వకంగా కలసి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. హైస్కూల్ కమిటీ ఛైర్మన్‌గా మందల బొమ్మయ్య, వైస్‌ఛైర్‌పర్సన్ ఆదిలక్ష్మి, ఎస్సీ కాలనిఈ ప్రైమరీ పాఠశాల ఛైర్‌పర్సన్ సాయిమాధురి, వైస్ ఛైర్‌పర్సన్ గీతాంజలి ఎమ్మెల్యేను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. టీడీపీ మండల ఇన్‌చార్జి బాలాజీ, కన్వీనర్ శ్రీనివాసులు, శశాంక చౌదరి, శ్రీనివాస రెడ్డి, కందుల ఓబుళపతి, రామదాసు, అక్కులన్న, ఆదెప్ప, మల్లన్న పాల్గొన్నారు.

అంబేడ్కర్ కళాశాల కమిటీ ఎన్నిక



చైర్మన్, వైస్‌చైర్మన్‌తో ప్రిన్సిపాల్, టీడీపీ నాయకులు

అనంతపురంరూరల్, ఆగస్టు 11: మండలంలోని కురుగుంటలో ఉన్న అంబేడ్కర్ జూనియర్ కళాశాల కమిటీ ఎన్నిక ఆదివారం జరిగింది. ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు ఆధ్వర్యంలో కమిటీని ఎన్నుకొన్నారు. చైర్మన్‌గా ఎం.తిరుపాలు, వైస్‌చైర్మన్‌గా ఆర్.రామాంజనేయులను ఎన్నుకొన్నారు. రాప్తాడు నియోజకవర్గం అధ్యక్షుడు కురుగుంట నారాయణస్వామి, తదితరులు పాల్గొన్నారు.

గిరినాథ్‌రెడ్డి సూపర్ సెంచరీ



అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 11: జిల్లా బ్యాటర్ గిరినాథ్‌రెడ్డి సూపర్ సెంచరీ చేశాడు. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ రాష్ట్ర స్థాయి సీనియర్ క్రికెట్ పోటీలు కడపలో నిర్వహించారు. మొదటి ఇన్నింగ్స్‌లో 96.1ఓవర్లలో 429పరుగులకు ఆలౌట్ అయ్యింది. ఇందులో జిల్లా బ్యాటర్ గిరినాథ్‌రెడ్డి 174 పరుగులు, యోగానంద 69పరుగులు సాధించారు. కడప జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 42.1ఓవర్లలో 190పరుగులకు ఆలౌటైంది. అనంతపురం రెండో ఇన్నింగ్స్‌లో 41.1ఓవర్లలో 210పరుగులకు ఆలౌటైంది. కడప రెండో ఇన్నింగ్స్‌లో 61ఓవర్లలో 7వికెట్లకు 231పరుగులు చేసింది. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది.

మణిపూర్, పశ్చిమ బంగా జట్ల విజయం



గెలుపొందిన మణిపూర్, పశ్చిమ బంగా జట్లు

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 11: జాతీయ ఫుట్‌బాల్ పోటీల్లో మణిపూర్, పశ్చిమబంగా జట్లు గెలుపొందాయి. జాతీయ జూనియర్ బాలికల ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్-2024-25 పోటీలు ఆదివారం స్థానిక అనంత క్రీడాగ్రామంలో తొమ్మిదోరోజు కొనసాగాయి. హర్యానాతో తలపడిన మణిపూర్ జట్టు మూడు పాయింట్ల తేడాతో విజయం సాధించింది. గోవాపై పశ్చిమబంగా మూడు పాయింట్ల తేడాతో గెలుపొందింది. రాష్ట్ర ఫుట్‌బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు వేణుగోపాల్, జిల్లా కార్యదర్శి మల్లేష్, కార్యవర్గసభ్యులు సురేష్, నాగార్జున, మూర్తి, కెండి, సంధ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

డ్రిప్, స్ప్రింక్లర్లకు దరఖాస్తు చేసుకోండి

గార్లదిన్నె, ఆగస్టు 11: మండలంలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో సూక్ష్మసేద్యానికి సంబంధించి డ్రిప్, స్ప్రింక్లర్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎంఐఏఓ సుశీలమ్మ కోరారు. ఆమె మాట్లాడుతూ రైతులకు అవసరమైన సూక్ష్మసేద్య పరికరాలు డ్రిప్, స్ప్రింకర్లను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. బోరుబావులు ఉండి నీటి సదుపాయం ఉన్న రైతులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అర్హులైన రైతులు తమ పేర్లను అందుబాటులో ఉన్న రైతుసేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకునే రైతులు పొలానికి సంబంధించిన 1బీ, ఎఫ్ఎంబీ స్కెచ్, చెక్కుబంది సర్టిఫికెట్, ఆధార్‌కార్డు, బ్యాంకు పాసుపుస్తకం, బోర్‌వెల్, కరెంట్ బిల్లులు పొందుపరచాలన్నారు. వివరాలకు రైతు సేవాకేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు.

ఇసుక ట్రాకర్ల సీజ్

తాడిపత్రి, ఆగస్టు 11: మండలంలోని సజ్జలదిన్నె వద్ద ఆదివారం ఇసుకను అక్రమంగా తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను సీజ్ చేశామని ఎస్ఐ కాటమయ్య తెలిపారు. స్థానిక పెన్నానది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో వెంటనే సిబ్బందితో కలిసి దాడులు చేశామన్నారు. అందులో మూడు ట్రాక్టర్లను పట్టుకుని సీజ్‌చేసి స్టేషన్‌కు తరలించామన్నారు. అలాగే కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

ఎముకల సాంద్రత పరీక్ష శిబిరం

తాడిపత్రి, ఆగస్టు 11: పట్టణంలోని రోటరీక్లబ్ కార్యాలయంలో ఆదివారం ఇన్నర్‌వీల్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత ఎముకల సాంద్రత పరీక్ష శిబిరాన్ని నిర్వహించినట్లు అధ్యక్షురాలు కౌసర్‌బేగం తెలిపారు. శిబిరంలో పాల్గొన్న 130మందికి రూ.1500విలువగల బీఎండీ పరీక్షలను ఉచితంగా నిర్వహించినట్లు చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ తిరుమలచైతన్య, ఫిజియోథెరపిస్ట్ ప్రహ్లాద, క్లబ్ కార్యదర్శి రేణుక, ట్రెజరర్ వాణి, సభ్యులు పాల్గొన్నారు.

నేటి నుంచి సర్పంచులకు శిక్షణ

యాడికి, ఆగస్టు 11: మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశ భవనంలో సర్పంచులకు, పంచాయతీ కార్యదర్శులకు సోమవారం నుంచి మూడురోజులపాటు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఈఓపీఆర్డీ వెంకటేష్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. గ్రామ పంచాయతీల్లో పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా, వీధిలైట్ల ఏర్పాటుపై ప్రణాళికలు, గ్రామ పంచాయతీల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. మండలవ్యాప్తంగా సర్పంచులు, కార్యదర్శులు సమావేశానికి హాజరుకావాలని ఆయన కోరారు.

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం నుంచి మూడు రోజుల పాటు సర్పంచ్‌లకు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సాల్మాన్ రాజ్ తెలిపారు. కార్యక్రమానికి ఎన్నికైన గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు, కార్యదర్శులు హాజరుకావాలన్నారు.

టాలెంట్ టెస్టుకు విద్యార్థుల హాజరు

గుంతకల్లుటౌన్, ఆగస్టు11: పట్టణంలోని కేసీ నారాయణ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో ఆదివారం కేసీ నారాయణ మెమోరియల్ టాలెంట్ టెస్టును నిర్వహించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు తెలిపారు. దివంగత నేత కేసీ నారాయణ జయంతిని పురస్కరించుకుని ఈ టెస్టును నిర్వహించామన్నారు. 29ప్రభుత్వ పాఠశాలల నుంచి సుమారు 1223 మంది విద్యార్థినీ విద్యార్థులు హాజరయ్యారన్నారు. సీనియర్, జూనియర్ స్థాయిలలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు రూ. లక్షమేర నగదు బహుమతులను ఇస్తామన్నారు. ఈనెల 20వ తేదీన కేసీ నారాయణ జయంతిని పురస్కరించుకుని విజేతలకు బహుమతులను అందజేస్తామన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ నబీహా పర్వీన్ తదితరులు పాల్గొన్నారు.

డీఎస్పీ బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరించిన డీఎస్పీ రవిబాబు

కళ్యాణదుర్గం రూరల్, ఆగస్టు 11: కళ్యాణదుర్గం నూతన డీఎస్పీగా రవి బాబు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. అనంతపురం ఇంటెలిజెంట్ డీఎస్పీగా ఉన్న ఆయన్ను రెండు రోజుల క్రితం ఇక్కడికి బదిలీ చేశారు. గతంలో ఇక్కడ పనిచేసిన బీ శ్రీనివాసులు అమరావతి డీజీపీ ఆఫీసుకు బదిలీ అయ్యారు. డీఎస్పీ రవిబాబు మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు పాటు పడతానని తెలిపారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

తుంగభద్ర గేటును త్వరగా ఏర్పాటు చేయాలి

ఉరవకొండ, ఆగస్టు 11: తుంగభద్ర డ్యాం 19 వ గేటు కొట్టుకుపోవడం వల్ల నీరంతా వృథాగా పోతోందని, యుద్ధ ప్రాతిపదికన గేటును ఏర్పాటు చేయాలని సీపీఐ నాయకుడు మల్లికార్జున డిమాండ్ చేశారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కరువు జిల్లా అయిన అనంతపురానికి తుంగభద్ర నీరే జీవనాధారమన్నారు. ఉమ్మడి అనంతపురం, కర్నూలు జిల్లాల్లో సాగు, తాగునీటిని అందిస్తున్న తుంగభద్ర డ్యాంకు ఎలాంటి నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నిపుణులైన ఇంజనీర్లతో డ్యాం మిగతా గేట్లకు సంబంధించిన అంశాలపై ఆంధ్ర, కర్ణాటక ప్రభుత్వాలు చర్చించాలని, భవిష్యత్తులో డ్యాంకు ఎలాంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని కోరారు. డ్యాం గేట్ కొట్టుకుని పోవడం వల్ల జిల్లా రైతాంగం ఆందోళనకు గురవుతోందన్నారు. ఆంధ్ర, కర్ణాటక ప్రభుత్వాలు సమన్వయంతో టీబీ డ్యాంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని తెలిపారు. సమావేశంలో నాయకులు సుల్తాన్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మరో కూలీ మృతి

కూడేరు, ఆగస్టు 11: రోడ్డుప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న మరో కూలి ఆదివారం మృతి చెందాడు. వివరాల్లోకెళ్తే.. మండలంలోని ఇప్పేరు గ్రామానికి చెందిన ఎర్రిస్వామి (55) అనే కూలీ గత నెల 29వ తేదీన ఉదయం జల్లిపల్లికి ద్రాక్ష మొక్కలను కటింగ్ చేయడానికి ఆటోలో తోటి కూలీలతో కలిసి వెళ్లాడు. సాయంత్రానికి పని ముగించుకుని ఆటోలో తిరుగు ప్రయాణమయ్యారు. మార్గంమధ్యలోకి రాగానే కుక్క అడ్డురావడంతో.. తప్పించబోయి ఆటో బోల్తా పడింది. ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. వారిని కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ గత శనివారం వన్నూరు స్వామిని మృతి చెందాడు. శనివారం మరో కూలీ ఎర్రిస్వామి కూడా మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

ప్రశంసాపత్రం గ్రహీతకు సన్మానం

గుంతకల్లుటౌన్, ఆగస్టు 11: ప్రపంచ చదరంగ సమాఖ్య ద్వారా అఫీషియల్ గిన్నిస్ వరల్డ్ రికార్డ్ ప్రశంశాపత్రాన్ని పొందిన పట్టణానికి చెందిన చెస్‌టోర్నమెంట్ ఆర్గనైజర్ నాగార్జున కర్నాటకంను ఆదివారం వైజాగ్‌లోని వాల్తేరు క్లబ్‌లో ఆంధ్రచెస్ అసోసియేషన్ వారు ఘనంగా సన్మానించారు. గత జూలై20వ తేదీన గుంతకల్లు పట్టణంలోని మాంటిస్సోరి స్కూల్లో గిన్నిస్ వరల్డ్ రికార్డు చెస్ టోర్నమెంట్‌ను నిర్వహించామని, ఈ టోర్నీ విజయవంతం చేసినందుకు గాను ఈ ప్రశంశాపత్రాన్ని అందించారని నాగార్జున కర్నాటకం ప్రకటనలో తెలిపారు.


నాగార్జున కర్నాటకంను సన్మానిస్తున్న దృశ్యం


వంతెన కింది భాగంలో ఊడిన సిమెంట్ పెచ్చులు


వంతెన కింద దిమ్మెకు ఊడిపోయిన రాళ్లు

ప్రమాదకరంగా హెచ్చెల్సీ వంతెన

● శిథిలావస్థకు చేరి కూలడానికి సిద్ధంగా ఉన్నవైనం

ఉరవకొండ, ఆగస్టు 11: మండలంలోని రాయంపల్లి సమీపం వద్ద హెచ్చెల్సీపై ఉన్న వంతెన పూర్తిగా శిథిలమై కూలడానికి సిద్ధంగా ఉంది. వంతెన పునాది రాళ్లు ఊడిపోయాయి. కింది భాగంలో సిమెంట్ పెచ్చులు ఊడిపోయి ఇనుపకడ్డీలు కనిపిస్తున్నాయి. అలాగే ఇరువైపులా ఉన్న దిమ్మెలు కూడా శిథిలమై ప్రమాదకరంగా ఉంది. ఈ వంతెనపై రాయంపల్లి నుంచి వ్యాసాపురం, నింబగల్లు గ్రామాలకు రాకపోకలు సాగిస్తుంటారు. వంతెన అప్పుడో.. ఇప్పుడో కూలేలా ఉండడంతో.. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో ఆందోళనగా ఉందని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. మరమ్మతులు చేపట్టాలని రెండేళ్ల నుంచి హెచ్చెల్సీ అధికారులకు విన్నవిస్తున్నా పట్టించుకున్న దాఖలాలు లేవని, గత్యంతరం లేక భయం.. భయంగా ఆ వంతెనపైనే ప్రయాణించాల్సి వస్తోందని ఆవేదన చెందుతున్నారు. ఆధునికీకరణ పనుల సమయంలో కాలువపై కొత్త బ్రిడ్జి నిర్మించినా.. ఆ నిర్మాణం అస్తవ్యస్తంగా జరిగిందని వారు పేర్కొంటున్నారు. పాత బ్రిడ్జికే మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

అదనంగా చెల్లించిన డబ్బు వెనక్కి ఇప్పిస్తాం

● హౌసింగ్ ఏఈఈ ప్రశాంత్‌కుమార్

ఆంధ్రజ్యోతి స్పందన

యాడికి, ఆగస్టు 11: మండలకేంద్రంలోని జగనన్న లేఔట్‌లో ఇళ్ల నిర్మాణానికి లబ్ధిదారులు కాంట్రాక్టర్‌కు అదనంగా చెల్లించిన డబ్బులను వెనక్కి ఇప్పించేలా చర్యలు చేపడతామని హౌసింగ్ ఏఈ ప్రశాంత్‌కుమార్ తెలిపారు. నాణ్యమైన ఇళ్లు నిర్మాస్తానని చెప్పి అదనంగా ఒక్కో లబ్ధిదారుడితో రూ. 35 వేలు చొప్పున 50 మందితో వసూలు చేసిన కాంట్రాక్టర్ ఇళ్ల నిర్మాణం పూర్తి చేయకనే చేతులెత్తేశాడు. దీనిపై గత ఆదివారం ఇంటికో వ్యథ శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి హౌసింగ్ ఏఈ స్పందించి మాట్లాడారు. అదనంగా డబ్బులు తీసుకున్న కాంట్రాక్టర్ ఇళ్ల నిర్మాణాలను పూర్తిచేయని మాట వాస్తవమేనని అన్నారు. ఇదే విషయాన్ని లబ్ధిదారులు తమ దృష్టికి తీసుకొచ్చారన్నారు. తాను ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లానని తెలిపారు. లబ్ధిదారులు ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డిని కూడా కలిసి సమస్యను విన్నవించారన్నారు. అదనపు డబ్బులు చెల్లించి నిర్మాణ పనులు పూర్తికాని వారందరికీ డబ్బులు వెనక్కి ఇప్పిస్తామని ఏఈ పేర్కొన్నారు.

హౌసింగ్ ఇళ్ల నాణ్యతపై బాధ్యత ఎవరిది?

అదనంగా చెల్లించిన డబ్బులు వెనక్కి ఇప్పిస్తామని చెబుతున్న అధికారులు ఇళ్ల నిర్మాణ పనుల నాణ్యతను ఎందుకు విస్మరించారని పలువురు లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారు. ఇళ్ల నిర్మాణం పూర్తికాకమునుపే పైకప్పు కూలడానికి సిద్ధంగా ఉన్నాయని, వాటిలో ఎలా నివాసం ఉండాలని తెలిపారు. మరికొన్ని ఇళ్లగోడలు నెర్రెలు చీలాయన్నారు. నాణ్యతను పర్యవేక్షించాల్సిన అధికారులు ఏమి చేస్తున్నట్లు అని ప్రశ్నిస్తున్నారు. ఇళ్ల నిర్మాణాలకు వాడాల్సిన సిమెంట్, ఇసుక పక్కదారి పట్టించారని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. ఇలా చేయడంతోనే నాణ్యత కొరవడినట్లు తెలిపారు. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ చేపడితే జగనన్న ఇళ్ల నిర్మాణాలలో అక్రమాలు బయటపడతాయని వారు కోరుతున్నారు.

క్రీడాసామగ్రి అందజేత


క్రీడా సామగ్రిని అందజేస్తున్న ఫ్రాంచైజీ అనిల్ చౌదరి

కళ్యాణదుర్గం రూరల్, ఆగస్టు 11: ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఆధ్వర్యంలో పట్టణంలోని కరణం చిక్కప్ప క్రీడా మైదానంలో ఈ నెల 15వ తేదీ నుంచి కేపీఎల్ క్రికెట్ టోర్నీ ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో టీం తారక్ టైగర్స్ క్రీడాకారులకు, కోచ్‌లకు, మెయింటర్స్‌కు, సలహా దారులకు జూనియర్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ ఆధ్వర్యంలో షూస్, ఇతర క్రీడా సామగ్రి పంపిణీ చేశారు. దాదాపు రూ. 50 వేల విలువ కలిగిన సామగ్రిని క్రీడాకారులకు అందించారు.

శంకుస్థాపన కాకనే.. ఐరన్ దోపిడీ

● వేములపాడు బీఎంసీయూ నిర్మాణంలో వైసీపీ నాయకుడి చేతివాటం


వేములపాడు సచివాలయ గోడౌన్‌లో ఉన్న ఇనుప కడ్డీలు

యాడికి, ఆగస్టు 11: మండలంలోని వేములపాడులో బల్క్ మి ల్క్ కూలింగ్ యూనిట్‌కు శంకుస్థాపన జరగకనే రూ.2 లక్షల విలువ జేసే ఐరన్ దోపిడీకి గురైంది. వేములపాడులో రూ.17.10లక్షల వ్యయంతో బల్క్‌మిల్క్ కూలింగ్ యూనిట్ నిర్మాణానికి ఏడాదిక్రితం అనుమతులు వచ్చాయి. ఇందులో భాగంగా రూ.2 లక్షల విలువగల ఐరన్ కడ్డీలు వచ్చాయి. అయితే నేటి వరకు బల్క్‌మిల్క్ కూలింగ్ యూనిట్ నిర్మాణానికి శంకుస్థాపన కూడా జరగలేదు. నిర్మాణ పనుల కోసం వచ్చిన ఐరన్ కడ్డీలను స చివాలయ నిర్మాణ పనులు చేపట్టిన వైసీపీ నాయకుడు తన అవసరాలకు వాడుకున్నాడు. మిగిలిన కొద్దిపాటి ఐరన్‌ను సచివాలయ గోడౌన్‌లో భద్రపరిచాడు. రూ.2లక్షలు విలువగల ఐరన్‌ను వైసీపీ నాయకుడు దోచేశాడని, శంకుస్థాపన కూడా చేయకుండానే స్వాహా చేశాడని గ్రామంలో కొద్దిరోజులుగా గుసగుసలు మొదలయ్యాయి. దీనిపై పంచాయతీ కార్యదర్శి అరుణ్‌కుమార్‌ను వివరణ కోరగా బల్క్ మిల్క్ కూలింగ్ యూనిట్ ఏర్పాటుకు రూ.2లక్షల విలువగల ఐరన్ వచ్చిన మాట వాస్తవమేనని తెలిపారు. దీనిని సచివాలయ నిర్మాణ పనులు చూస్తున్న కాంట్రాక్టర్ సీహెచ్‌సీ నిర్మాణ పనులకు వాడుకున్నట్లు తమకు తెలిసిందన్నారు. ఆ ఐరన్ ఖరీదును అతని నుంచి రికవరీ చేస్తామని చెప్పారు.

ఘనంగా స్వాతీనక్షత్ర పూజలు


విశేష అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి

తాడిపత్రి, ఆగస్టు 11: మండలంలోని ఆవులతిప్పాయపల్లి గ్రామ సమీపంలో వెలసిన ఓబులేసుకోన లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో ఆదివారం స్వాతి నక్షత్ర పూజలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా శ్రీదేవి, భూదేవి సమేత నరసింహస్వామి మూలవిరాట్‌కు ఉదయమే అర్చకులు అభిషేకాలు, అలంకరణలు, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అమ్మవార్ల సమేత స్వామివారి ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలతో అలంకరించి వేదమంత్రాల నడుమ కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొని తీర్థప్రసాదాలు పొందారు.

అవినీతికి పాల్పడుతూ బెదిరింపులా?

● పలువురు రేషన్ డీలర్లపై టీడీపీ నాయకుల మండిపాటు

బెళుగుప్ప, ఆగస్టు 11: పలువురు చౌకధాన్యపు డిపో డీలర్లు నిత్యావసర సరుకుల పంపిణీలో అవినీతికి పాల్పడుతుండడంతో పాటు తనిఖీ అధికారులను సైతం బెదిరిస్తున్నారని, ఇదేం పద్ధతని టీడీపీ నాయకులు మండిపడ్డారు. మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున, జిల్లా ఉపాధ్యక్షుడు పెద్దతిప్పయ్య, జీడిపల్లి, ఆవులెన్న సర్పంచ్‌లు వెంకట నాయుడు, రాము విలేకరులతో మాట్లాడారు. జీడిపల్లిలో 32వ రేషన్‌దుకాణంలో అవకతవకలు జరుగుతున్నట్లు తనిఖీలలో తేలడంతో కేసులు కూడా నమోదయ్యాయన్నారు. డీలర్ సరుకులు సక్రమంగా అందించడం లేదని, కులవివక్ష పాటిస్తున్నారంటూ ఫిర్యాదులు అందడంతో, ఇటీవల రెవెన్యూ అధికారులు విచారణకు వెళ్లారని, కాగా ఆ డీలర్ చేతనైనది చేసుకోండి.. నాకు కోర్టు ఉందని ఎదురించి మాట్లాడారన్నారు. అలాగే బెళుగుప్ప 2 రేషన్‌దుకాణం డీలర్ కూడా తనిఖీకి వెళ్లిన అధికారులను నన్నేమి చేయలేరని బెదిరించినట్లు తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వ అండదండలతో దోచుకుని లబ్ధిదారులకు ఆ డీలర్లు అన్యాయం చేశారన్నారు. అధికారులు విచారణ చేపట్టాలని డిమాండ్ చేశా రు. నాయకులు దామోదర, తిమ్మప్ప, అనంత, సిద్దయ్య పాల్గొన్నారు.

చారిత్రక సంపదను పరిరక్షించుకోవాలి

● కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం కల్చరల్, ఆగస్టు 11: జిల్లాలోని చారిత్రక సంపదను పరిరక్షించుకోవాలని కలెక్టర్ వినోద్‌కుమార్ అన్నారు. ఆదిమూర్తినగర్‌లోని పురావస్తు ప్రదర్శనశాలను ఆదివారం కలెక్టర్ సందర్శించారు. ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని ప్రతి గ్రామ, మండల, మున్సిపల్ ఏరియాలు, పొలాలు, నదీ ప్రదేశాల్లోని చారిత్రక ప్రాధాన్యం కలిగిన రాతి విగ్రహాలు, పనిముట్లు, వస్తువులను గుర్తిస్తే పురావస్తు శాఖకు సమాచారం అందజేసి, స్వచ్ఛందంగా అప్పగించేందుకు సహకరించాలన్నారు. భారత పౌరులుగా బాధ్యతతో ప్రాచీన సంపద, ప్రాచీన కలల గురించి భావితరాలకు అందజేయాల్సిన అవసరముందన్నారు. కార్యక్రమంలో పురావస్తుశాఖ ఏడీ రజిత, అసిస్టెంట్ మహేంద్రనాయుడు, టైపిస్ట్ గంగా నరేష్‌బాబు తదిత రులు పాల్గొన్నారు.

వైభవంగా ముత్యాలమ్మ జాతర


ప్రత్యేక అలంకరణలో ముత్యాలమ్మ అమ్మవారు

గుత్తి, ఆగస్టు 11: గుత్తి ఆర్ఎస్‌లోని రామాలయం వీధిలో ఆదివారం ముత్యాలమ్మ జాతరను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఆలయంలో ఉదయమే అర్చకులు అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు చేశారు. అనంతరం విశేష పూజలు జరిపారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

గుట్టలనూ వదలని కబ్జాదారులు

● ప్లాట్లు వేసి విక్రయిస్తున్న వైనం
● పట్టించుకోని అధికారులు


గుంతకల్లులో గుట్టను చదును చేసిన దృశ్యం

గుంతకల్లుటౌన్, ఆగస్టు 11: కబ్జాదారులు ప్రభుత్వ గుట్టలను కూడా వదలడం లేదు. వాటిని కూడా చదును చేసి ప్లాట్లు వేసి విక్రయిస్తూ వేలాది రూపాయలను దండుకుంటున్నారు. పట్టించుకోవాల్సిన రెవెన్యూ అధికారులు చోద్యం చూస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలోనే పట్టణంలోని కొందరు అక్రమార్కులు ప్రభుత్వ భూముల్లోని గుట్టలను కబ్జా చేసి సొమ్ము చేసుకున్నారు. కూటమి అధికారంలోకి వచ్చినా వారు మానడం లేదు. పట్టణ శివారులోని దోనిముక్కల రోడ్డులో సర్వే నెంబర్ 563సీ పొలం పక్కన ప్రభుత్వ భూమిలో గుట్ట ఉంది. ఆ గుట్ట మీద కబ్జాకోరుల కన్ను పడింది. గుట్టను చదును చేయించి అందులో ప్లాట్లు వేసి వేలాది రూపాయలకు విక్రయిస్తున్నారు. ఆ గుట్టలను నిరుపేదలకు ఇంటి స్థలాలుగా మంజూరు చేయాలని ఆయా ప్రాంతాల వాసులు కోరుతున్నారు. గుట్టలను చదును చేసిన వ్యక్తులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

క్రిమినల్ కేసులు పెడతాం

దోనిముక్కల రోడ్డులోని ప్రభుత్వ భూమిలో గల గుట్టను పరిశీలిస్తాం. అలాగే అక్కడ హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేస్తామం. ఏవరైనా ప్రభుత్వ భూములు, గుట్టలను కబ్జా చేయాలని చూస్తే క్రిమినల్ కేసులు పెడుతాం.

-రమాదేవి, తహసీల్దార్

పూడికతీత పనుల పరిశీలన


జయనగర్ కాలనీలో డ్రైనేజీని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

తాడిపత్రి, ఆగస్టు 11: పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఐదు రోజుల నుంచి చేపడుతున్న మురుగు కాలువల్లోని పూడికతీత పనులను ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి ఆదివారం పరిశీలించారు. స్థానిక జయనగర్‌కాలనీ, బుడగజంగాల కాలనీ, యల్లనూరురోడ్డు తదితర ప్రాంతాల్లోని మురుగు కాలువల్లో ఏళ్ల తరబడి పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని మున్సిపల్ సిబ్బంది తొలగిస్తున్నారు. ఈ పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. డ్రైనేజీల్లో ఎక్కడా మురుగునీరు నిల్వ ఉండరాదన్నారు. డ్రైనేజీల్లో, బహిరంగ ప్రదేశాల్లో చెత్తాచెదారం వేయరాదని ప్రజలను కోరారు. తర్వాత జయనగర్‌కాలనీలో ఇంటింటికీ వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన టీడీపీ నాయకులు వెంట కదిరి శ్రీకాంత్ రెడ్డి, హరినాథ్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డి, కౌన్సిలర్ విజయ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

యాడికి-బుగ్గ రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు

● ఎమ్మెల్యే ఆదేశాలతో అధికారుల్లో చలనం


యాడికి- బుగ్గరోడ్డులో గుంతలను పూడ్చిన దృశ్యం

ఆంధ్రజ్యోతి స్పందన

యాడికి, ఆగస్టు 11: ఎ మ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి ఆదేశాలతో గుంతలు పడ్డ యాడికి-బుగ్గ రోడ్డుకు అధికారులు ఆదివారం తాత్కా లిక మరమ్మతులు చేపట్టా రు. మండలంలో పలు గ్రామాలకు వెళ్లే రోడ్లు గుంతలు పడి అధ్వానంగా ఉండడంపై గత శనివారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో 'బాగు చేయండి ప్లీజ్' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. ఇందుకు స్పందించి ఎమ్మెల్యే అస్మిత్‌రెడ్డి గుంతలు పడ్డ రోడ్ల కు తక్షణమే మరమ్మతులు చేపట్టాలని సంబంధితాధికారులను ఆదేశించారు. దీంతో వారు కాంట్రాక్టర్ చేత ఆదివారం యాడికి- బుగ్గరోడ్డులో గుంతలు పూడ్చివేయించారు. గుంతలు పడ్డ రోడ్డుకు మరమ్మత్తులు చేపట్టడంతో వాహనదారులు హర్షం వ్యక్తం చేశారు. మరికొద్ది రోజులకు అయినా రోడ్డు గుంతలకు శాశ్వత పరిష్కారం చేపట్టాలని వారు కోరారు.

పిల్ల కాలువ పనులను వెంటనే ప్రారంభించాలి


నిరసన తెలుపుతున్న రైతుసంఘం, సీపీఐ నాయకులు

గుంతకల్లు టౌన్, ఆగస్టు 11: రాగులపాడు లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా గుంతకల్లు, పామిడి మండలాలకు సాగు,తాగునీరు ఇవ్వడానికి పిల్ల కాలువ పనులను వెంటనే ప్రారంభించాలని సీపీఐ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు మండలంలోని దోనిముక్కల గ్రామ పొలాల సమీపంలో ఉన్న శిలాఫలకాల వద్ద ఆదివారం వారు నిరసన తెలిపారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి గోవిందు, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి మాట్లాడుతూ పిల్ల కాలువల నిర్మాణానికి రెండు సార్లు భూమి పూజ చేశారన్నారు. రాగులపాడు లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా పిల్ల కాలువలను ఏర్పాటు చేయాలని గత ఎనిమిది సంవత్సరాల నుంచి సీపీఐ, రైతు సంఘం ఆధ్వర్యంలో అనేక పోరాటాలు చేశామన్నారు. 2019కి ముందు టీడీపీ హయాంలో పామిడి మండలానికి అప్పటి సీఎం చంద్రబాబు వచ్చి పిల్లకాలువ ద్వారా హంద్రీనీవా నీరు ఇవ్వడానికి రూ. 42కోట్లను ప్రకటించారన్నారు. అనంతరం వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఎమ్మెల్యే వై. వెంకటరామిరెడ్డి రూ. 43కోట్లను నిధులు విడుదల చేయించారన్నారు. కానీ ఇంత వరకు పనులు ప్రారంభించలేదన్నారు. పిల్లకాలువ పనులను వెంటనే ప్రారంభించేలా చర్యలు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాంను కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి మహేష్, మండలకార్యదర్శి రాము, సహాయ కార్యదర్శి రామాంజనేయులు, పట్టణ సహాయ కార్యదర్శి ఎస్ఎండీ గౌస్, వ్యవసాయకార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి దేవేంద్ర, నాయకులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలకు న్యాక్ బృందం రాక



ప్రభుత్వ డిగ్రీ కళాశాల

ఉరవకొండ, ఆగస్టు 11: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఈ నెల 19, 20 వ తేదీలలో న్యాక్ బృందం స భ్యులు సందర్శించనున్నారు. ఇందు కోసం కళాశాల సర్వాంగ సుందరంగా ముస్తాబవుతుంది. న్యాక్ బృందం కళాశాలలో బోధిస్తున్న సిలబస్, బోధనా పద్ధతులు, పరిశోధన లు, సదుపాయాలు, పరిపాలన తదితర అంశాలపై సమగ్రంగా వివరాలు సేకరించనున్నట్లు సమాచారం. గత 2016 ఫిబ్రవరిలో ఇదివరకే న్యాక్ బృందం పర్యటించి కళాశాలకు బీగ్రేడ్ ఇచ్చిన విషయం విధితమే. ఈ సారి కళాశాలకు ఏ గ్రేడ్ సాధించుకోవడానికి ప్రయత్నాలు జరుగుతున్నట్లు సమాచారం. రెండ్రోజులపాటు న్యాక్ బృందం సభ్యులు కళాశాలను సందర్శించి, గత ఐదేళ్లకు సంబంధించిన రికార్డులను, అభివృద్ధి పనులను, మార్పులు చేర్పులను పరిశీలించనున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్లకు త్వరగా మరమ్మతులు చేపట్టాలి

రాయదుర్గంరూరల్, ఆగస్టు 11: మరమ్మతులకు గురైన ట్రాన్స్‌ఫార్మర్లను త్వరగా బాగు చేసి వ్యవసాయానికి నాణ్యమైన కరెంట్‌ను అందించాలని రైతు సంఘం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి తిప్పేస్వామి డిమాండ్ చేశారు. విద్యుత్ సమస్యలు పరిష్కరించాలంటూ ఆదివారం ఆవులదట్లలో రైతులు చేపట్టిన ఆందోళనకు మద్దతుగా తిప్పేస్వామి రైతుసంఘం నాయకులతో కలిసి 74 ఉడేగోళంలోని సబ్‌స్టేషన్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... 74 ఉడేగోళం సబ్‌స్టేషన్ పరిధిలో ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతులకు గురవడంతో దాదాపు 20 రోజుల నుంచి వ్యవసాయానికి విద్యుత్ సక్రమంగా అందడం లేదన్నారు. దీనివల్ల నీరందక పంటలు ఎండిపోయే పరిస్థితి వచ్చిందన్నారు. వెంటనే సబ్‌స్టేషన్‌లో నెలకొన్న విద్యుత్ సమస్యలను త్వరగా పరిష్కరించి వ్యవసాయానికి 9 గంటల ఉచిత విద్యుత్ సక్రమంగా అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ప్రతి గ్రామ రైతులను కలుపుకొని రాయదుర్గం విద్యుత్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

వర్షంకోసం సత్యమ్మకు పూజలు


అమ్మవారికి జలాభిషేకం చేస్తున్న గ్రామస్థులు

పుట్లూరు, ఆగస్టు 11: వర్షం కురవాలని కోరుతూ మండలంలోని కుమ్మనమల గ్రామంలో ఆదివారం గ్రా మస్థులు గ్రామదేవత సత్యమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి 101 బిందెలతో జలాభిషేకం చేశారు. అనంతరం 101 టెంకాయలు, 101 నిమ్మకాయలు సమర్పించి ప్రత్యేక పూజలు జరిపారు. పూ జల్లో గ్రామస్థులు పెద్దఎత్తున పాల్గొన్నారు.